జూలై - 2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,



**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కొడవటికంటిగారు... | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| నేనంటే నేనే | కె.ఇ. రాజేంద్ర | 08 |
| శిష్యత్వము | డా॥ సుష్మ, నెల్లూరు | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| కొడవటికంటి | సాక్ష్యము | 11 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| అన్న | స్త్రీల కొరకు | 20 |
| అవసరత | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-07 | | 24 |



**HANNA KRUPA**
Christian Devotional Monthly Magazine

సంపుటి : 21 సంచిక : 07


ప్రభువగు యెహోవాయే నాకు బలము

INTERNATIONAL CHURCH OF THE LORD INDIA 1958

సీరియల్ నంబరు

సంపాదకీయం....

# కొడవటికంటిగారు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

మా తండ్రిగారైన కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారు గత సంవత్సరం జూలై 3వ తేది ఉదయం 10-55 ని.లకు ప్రభువు నందు నిద్రించినారు. ఆయన 20 సం॥లు 'హన్నాకృప' పత్రికను నడిపించి, 'కొడవటికంటి' అను కలం పేరుతో 30కి పైగా బైబిల్లోను వ్యక్తుల చరిత్రను నవలలుగా వ్రాసి చిన్నా, పెద్ద, పేద, ధనిక, క్రైస్తవులు, అన్యజనులు అన్న తేడా లేకుండా అనేకమంది పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన రచనల ద్వారా ఎంతోమంది అభిమానులను సంపాదించుకొని, అనేకమందిచే సన్మానాలు, పురస్కారాలు పొందారు. 2013లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిగారి చేతుల మీదుగా 'ఉత్తమ క్రైస్తవ నవలా రచయిత' అవార్డు పొందియున్నారు. ఎంతోమంది ఆఫీసర్లు, రాజకీయ నాయకులు, బాగా డబ్బున్న వాళ్ళు ఆయనను ప్రేమించి, గౌరవించేవాళ్ళు. ఆయన మాత్రం ఈ లోకానుసారమైన ఆడంబరాలకు దూరంగా ఉండే వాడు. సామాన్యమైన జీవితం జీవిస్తూ, దేవుని పనికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సువార్త ప్రకటించడానికి గ్రామాలు, పట్టణాలు, రాష్ట్రాలు ప్రయాణించేవాడు. సామ్యేల్ రాజేంద్రగారిని పోషించడానికి, హన్నాకృప పత్రికను నడిపించ డానికి, ఆయన వ్రాసిన పుస్తకాలు ముద్రించడానికి దేవుడు అనేకమందిని సిద్ధం చేశాడు.

మా తండ్రిగారు నా మీద నమ్మకముతో నాకు అప్పగించిన 'హన్నాకృప' బాధ్యతను, ఆయన రచనల బాధ్యతను ఆయనను ప్రేమించే కుమారునిగా ఆయన పేరు నిలబెట్టుటకు, మీ ప్రార్ధనా సహకారములతో నా శాయశక్తుల కృషి చేస్తాను. పత్రిక నిర్వహణకు ప్రతినెలా ఆర్థిక సహాయము చేస్తున్న కొంతమంది నాన్నగారు చనిపోయిన తర్వాత ఆర్థిక సహాయాన్ని నిలిపివేశారు. అయినప్పటికీ దేవుని సహాయము వలన పత్రిక నిర్వహించబడుతుంది.

నాన్నగారు రచించిన పుస్తకములను తిరిగి ముద్రించుట చాలా వ్యయప్రయాసలతో కూడినదైనప్పటికీ ప్రభువు కృప వలన ఆయన రచించిన చివరి పుస్తకమైన 'మిక్కిలి సాత్వికుడు' మరియు 'అపొస్తలుడు' (అపొస్తలుడు, బర్నబా, తిమోతి పుస్తకాలను కలిపి ఒకే పుస్తకముగా) ముద్రించడం జరిగింది. ప్రస్తుతము 'జప్పత్నేహు, 'నా చిత్తానుసారుడు' ముద్రణలో ఉన్నవి. 'నా స్నేహితుడు', 'సువార్తలలోని యేసుకథ' (మూడు భాగములు కలిపి) ముద్రణకు సిద్ధముగా ఉన్నవి. నాన్నగారు జీవించియున్నప్పుడు ఆయనను ఆదరించిన ప్రతిఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. జూలై 03వ తేది ఉదయం పది గంటలకు క్లౌపేట, 6వలైనులోని ప్రభువు సంఘము నందు నిర్వహించబడే నాన్నగారి ప్రథమ జ్ఞాపకార్ధ కూడికకు మిమ్ములను ప్రేమతో ఆహ్వానించుచున్నాను.

-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

# జఫ్నత్పనేహు



**(యోసేపు జీవిత చరిత్ర)**

– కొడవటికంటి

"ఆసెనతు నీకెలా తెలుసు? అని అడిగాడు యోసేపు.

"ఓను యాజకునికి ఫరో ఇచ్చిన ధాన్యం చేర్చటానికి నేను నెల్లియోపోలీస్ వెళ్లినప్పుడల్లా నన్ను పలకరించి నమస్కరించేది. కాని నాలుగురోజుల క్రితం నేను వెళ్ళినప్పుడు ఆ అమ్మాయి ప్రత్యేక మర్యాదలు చేసిన తర్వాత చాలాసేపు ఆ విషయం, ఈ విషయం మాట్లాడింది. ఇంటికి వచ్చిన తర్వాత ఆలోచిస్తే, ఆ అమ్మాయి మాట్లాడినదంతా నిన్ను గురించేనని అర్ధమైంది. చిన్నపిల్ల అయినా చాలా తెలివి గలది, మంచిది" అని చెప్పి "వెళ్ళొస్తా!" అని వెళ్ళిపోయాడు. అప్పటిదాకా కొంచెం దూరంలో నిలుచుండి చూస్తున్న చెరసాల సిపాయి వచ్చి ఇనుప తలుపు దగ్గరగా లాగి తాళం వేశాడు.

లోపల చీకటిగా ఉంది. కానీ చల్లగా ఉంది. యోసేపు నిద్రపోవాలని పండు కున్నాడు. కటిక నేలమీద అలవాటు లేనందువల్ల నిద్రపట్టలేదు. తను గర్వించి అన్నల మీద అతిశయించినందువల్ల అమ్మబడ్డాడు. అయితే తన బేతేలు దేవుని కృప వలన, ఆయనలో పెరుగుతున్నందు వలన ఈనాటి ఈ తుఫానులో ధైర్యంగా నిలువగలిగాడు. ఎన్నో ఆలోచనలు మనసులో తిరుగుతున్నాయి. కానీ ఒక్కటి కూడా ఆలోచించడానికి వీలుగా నిలబడటం లేదు. పిచ్చిపట్టడానికి ముందు మనిషి మెదడు పరిస్థితి ఇలాగే ఉంటుంది కాబోలు అనుకుంటే భయమేసింది. ఒకవేళ ఇప్పుడు కనబడే పిచ్చి వాళ్ళందరూ తన లాగానే రకరకాల అనుభవాలు వెంట వెంటనే అనుభవించాల్సి వచ్చిందేమో? అని అనుకున్నాడు. పిచ్చివాడిగా తయారవ్వడం కంటే ఇప్పటి ఈ అవమానమునే స్వీకరించటం మంచిది కదా! జరిగిందేదో జరిగిపోయింది. ముందు అలజడిగా ఉన్న మనసును నిశ్చలం చేస్తేనేగాని చేయవలసిన పనులు, నడవవలసిన పద్ధతి పూర్తిగా ఆలోచించడానికి వీలు కలుగుతుంది. మనస్సును స్థిమితంగా ఉంచాలంటే దైవాలోచనే సరైనది.

తెల్లవారుతుండగా, తన మీదుగా పరుగెత్తి పోయినా చిన్న జంతువు. అది ఎలుక అయివుండాలి. ఇక నువ్వు నేను కలిసి జీవించాలి అని చెప్పినట్లుగా ఉంది. తెల్లవారు తుంటే భయం వేసింది. పోతీఫరు ఇంట్లో, నమ్మకస్తునివలె నటించి ఆయన భార్యనే అవమానం చేయబోయి ఆమె కేకలు వేసినందువలన పట్టుబడిన ఒక స్వామిద్రోహి, ఈ చెరసాలలో వేయబడినాడని చెప్పుకుంటారు. అతను హెబ్రీ బానిస అని, అతనే తన తప్పు ఒప్పుకొని రాత్రి చెరసాల అధికారికి లొంగిపోయాడని చెప్పుకుంటారు. యోసేపుకు సిగ్గువేసింది. ఉదయం ఎండెక్కిన తర్వాత కాని యోసేపు బయటకు రాలేదు. పదిగంటలకు అక్షాపు వచ్చాడు. యోసేపును బయటకు తీసుకొని వచ్చాడు. ముఖం కడిగించి ఉదయకాల భోజనం పెట్టించి వెళ్ళిపోయాడు. రెండవ రోజుకూడా అక్షాపు బలవంతం మీదనే చెరసాల గదిలో నుండి బయటకు వచ్చాడు. కొన్ని రోజులకు అలవాటై పోయింది. అక్షాపు రావటం లేదు. తనని ఎవరూ వివరాలు అడగలేదు. రాతినేల అలవాటైపోయింది. బాగానే నిద్ర పడుతుంది. భోజనం కూడా అలవాటై పోయింది.

ఫరో పుట్టిన రోజున రాజసంరక్షక సేనాధిపతి పోతీఫరు చెరసాలలోకి వచ్చి, ఫలహారము ఖైదీలకు పంచి పెట్టాడు. కాని యోసేపు ఫలహారాలు తీసుకోవడానికి వెళ్ళ లేదు. సాయంకాలం చెరసాల అధిపతి (కార్యనిర్వాహకుడు) యోసేపును తన గదికి పలిపించి, ఫలహారము ఇచ్చాడు. పోతీఫరు తన యోగక్షేమాలు విచారించినట్లు చెప్పాడు. చెరసాల అధికారితో పోతీఫరు ఏమి చెప్పాడో యోసేపుకు తెలియదు. కాని చెరసాల అధికారి ప్రతిరోజు యోసేపును తన గదికి పిలిపించి లెక్కలు వ్రాయించటం, ఇంకా అనేక పనులు చేయించేవాడు. ఒక నెల గడచిన తర్వాత యోసేపు అసలు తన గదిలోకి వెళ్ళటం చాలా వరకు తగ్గిపోయింది. చెరసాల అధికారితో కలసి భోజనం చెయ్యటం, అదే గదిలో

నిద్రపోవటం ప్రారంభమయ్యింది. కొన్ని నెలలు గడచిన తర్వాత రాత్రి సమయాల్లో అధికారి చెరసాలకు రాకుండా యోసేపుకు భాధ్యతలు అప్పగించి ఇంట్లో ఉండిపోయేవాడు. ఎన్నోసార్లు అవకాశములు వచ్చినా, యోసేపు భూమిలో ఉన్న చెరసాల నుండి పైకి రాలేదు.

ఈ చెరసాలలో ఉన్న ఖైదీలందరూ రాజుగారి విష యంలో గాని అత్యున్నతమైన రాజ్యాధినేతల యెడలగాని తప్పు చేసినవారే. చెరసాలలో వారి నేరము ఋజువు చేయబడేంత వరకు సామాన్య ఖైదీలవలెకాక మంచి వస తులు కల్పించబడుతుంటాయి. కానీ నేరస్తులు ఏ పరిస్థితుల లోనూ తప్పించుకొని పోకుండా వీరి చెరసాల భూమి లోపల తయారు చేయబడుతుంది. భూమి మీదకు రావాలంటే ఒకటే సొరంగ ద్వారం. కనుక వీరికి భూమిలో ప్రత్యేకించి కాపలా గట్టిగా ఉండదు. ఆ చెరసాలలో దాదాపు ఆరువందల మంది ఖైదీలు ఉంటారు. అయితే ముఖ్యమైన ఖైదీలు, అంటే వారు రాజుగారి సన్నిధిలో ఉన్నతమైన పదవులు నెరవేర్చే వారై నందున వారికి చెరసాలలో అన్నీ అవసరాలు తీర్చబడు తుండేవి.

యోసేపు చెరసాలలో వేయబడినప్పుడు అతని నేరం నమోదు చేయబడలేదు. అతని మీద ఫిర్యాదు ఏమిటో కూడా వ్రాయబడలేదు. ఫిర్యాది ఎవరో కూడా వ్రాయబడలేదు. ఎందుకంటే ఆ చెరసాల యొక్క అత్యున్నత అధికారి పోతీ ఫరు కనుక. ఒక రాత్రి పదకొండు గంటల సమయంలో చెరసాల ఉపరితల ద్వారబంధం తెరచుకొన్న శబ్దం విని. భూమి సొరంగం ఉన్న ఇనుప ద్వారం వద్దకు వచ్చినప్పుడు నలుగురు యోధులు, ఒక ఆజానుబాహుడైన వ్యక్తిని స్పృహ తప్పేటట్లుగా కొట్టి మోసికొని వస్తుంటే చూసి, కావలి వారికి ద్వారం తెరవమని చెపితే, ఆ ఆజానుబాహుడుని తీసుకొని వచ్చి, ఒకగదిలో వేసి, బల్లయొద్ద కూర్చునియున్న యోసేపు యొద్దకు వచ్చారు. తీసుకొనివచ్చిన ఖైదీ వివరాలు యోసేపుకు చెప్తుంటే యోసేపు చెరసాల దినచర్య పుస్తకములో వ్రాయటం ప్రారంభించాడు.

పేరు : థేమాను

వృత్తి : దొంగతనము. రాజుగారి సమాధిని పగులగొడుతుండగా పట్టుబడ్డాడు. వివరాలు తెలియదు.

వయస్సు: సుమారు నలభై ఐదు సంవత్సరాలు.

ఖైదీని తీసుకొని వచ్చిన వారిలో ముఖ్యుడైన సైనికుని సంతకం తీసుకొని పంపివేశాడు. యోసేపు ఖైదీ దగ్గరగా వెళ్ళి ఒక దివిటీ వెలుతురులో ముఖం పరీక్షగా చూసాడు. ముఖం, శరీరం గాయాలతో నిండివుంది. స్పృహ కోల్పోయి నట్లుగా ఉన్నాడు. తిరిగి జీవిస్తాడని నమ్మకం లేదు. అయిదవ గదిలో ఒక వైద్యుడు ఖైదీగా ఉన్నాడని యోసేపుకు తెలుసు. ఆ వైద్యుని కొరకు ఒక భటుని పంపి పిలిపించాడు. ఆ వైద్యుడు అతని పరీక్షించి, “అతని శరీరం మొత్తం మెత్తగా దంచబడినట్లుగా కొట్టారు. అందువలన స్పృహ రావటానికి రెండు మూడు రోజులు పడుతుంది. కాని ఈ లోపల అతని శరీరంలోని ద్రవం అంతా హరించి చనిపోయే ప్రమాదం ఉంది” అని చెప్పాడు.

అతని సలహా మేరకు యోసేపు తన చేతి కడియాలలో ఒకటి అమ్మి, పట్టణం నుండి అతనికి కావలసిన మందులు తెప్పించి మూడు, నాలుగు రోజులు అతని దగ్గర ఉండి పరిచర్య చేసినందు వలన అతను స్వస్థత పొందాడు. అతను బ్రతికినందు వలన, విచారణ తర్వాత జరిపించబడుతుంది. సాధారణంగా రాజఖైదీలు చెరసాలలో చనిపోయే పరిస్థితు లలో చేర్చబడతారు. కాని పదిమందికి ఇద్దరు మాత్రం బ్రతుకుతారు. అయితే యోసేపుకు ఆ చెరసాల అధికారి, ఖైదీలనందరిని అతని చేతికి అప్పగించాడు. ఆ ఖైదీలు ఆ చెరసాలలో ఏమి చేయాలో అదంతా అతడే చేయించేవాడు. వారిని మరణాపాయాల నుండి యోసేపే కాపాడుతుండే వాడు. కాబట్టి యోసేపు మీద ఖైదీలందరూ అభిమానంగా ఉండి ఎవరికప్పగించిన బాధ్యతలు వారు ప్రేమతో నిర్వ హించేవారు. యోసేపు చేతికి ఈ బాధ్యత అప్పగించిన తరువాత యోసేపును బట్టి చెరసాల అధిపతి నెమ్మది కలిగి జీవించుచున్నాడని పోతీఫరు తెలుసుకొనినప్పుడు అతను కూడా చాలా సంతోషించాడు.

థేమాను చెరసాలలో వేయబడిన పదిరోజుల తర్వాత లేచి తిరగ గలుగుతున్నాడు. యోసేపు తనకు చేసిన ఉప కారానికి అతని హృదయం ఎంతో కృతజ్ఞతతో నిండి పోయింది. ఆ చెరసాలలో యోసేపు అతనితో మాట్లాడు తుంటే చాలా ఆసక్తి కలిగిన విషయాలు తెలిసాయి. యోసేపు పోతీఫరు ఇంటిలో అక్షాపు ద్వారా ఐగుప్తు, సిరియా భాషలు, గణితశాస్త్రం, రాజ్యాంగం ఎన్నో నేర్చుకున్నాడు. కానీ థేమాను వలన ఐగుప్తుదేశము, దాని పుట్టుక, రాజులు, వారి సామ్రాజ్య వైభవం, వారి అలవాట్లు, వారి దైవభక్తి అన్నింటి కంటే ఐగుప్తు ముఖ్యమైన ఆశయం, ఎవరి మరణం కొరకు వారు సిద్ధపడటంవంటివి తెలుసుకున్నాడు. ఐగుప్తీయులు పునర్జన్మ విషయం గూర్చి చాలా విశ్వాసం కలవారు. చని పోయినవారు కొంతకాలం అయిన తర్వాత వారి ఆత్మలు మరల తిరిగి వారి శరీరంలోకి ప్రవేశించి జీవిస్తారని, చని పోయినవారు వేరే రూపంలో రాకుండా తమ శరీరాలతో వస్తారని వారి నమ్మకం. అందుకనే ఐగుప్తీయులు వారు బ్రతికియుండగానే వారి వారి స్థితినిబట్టి, ఐశ్వర్యాన్నిబట్టి వారి సమాధులు రాతిలో తొలిపించుకుంటారు. రాజులు అయితే పిరమిడ్లు కట్టించుకొని అందులో తమ మరణా నంతరం సుగంధ ద్రవ్యాలతో ఎప్పటికినీ చెడిపోకుండా తయారు చేయబడే కొన్ని ప్రత్యేక ఏర్పాట్లతో పునర్జన్మ కొరకు ఆ సమాధిలో పెట్టబడే ఏర్పాటు చేసుకుంటారు. ఇందు నిమిత్తము ఐగుప్తీయులు చాలా ధనం వెచ్చిస్తారు.

చెరసాల అధిపతి అనారోగ్యంగా ఉండి రెండు రోజులు ఈ చెరసాలలోనికి రాలేదు. అందువలన యోసేపు చాలా ఇబ్బంది పడవలసి వచ్చింది. కానీ థేమాను చాలా సహకారిగా ఉన్నాడు. అప్పుడు థేమాను సంగతి యోసేపుకు బాగా అర్థం అయింది. థేమాను గణితశాస్త్రములోను, విదేశీ భాషలలోను, భూగోళశాస్త్రములోను, వాస్తుశాస్త్రములోను చాలా అనుభవము కలవాడు. కొంతకాలం ఫరో యొక్క క్రొత్త కట్టడములకు పర్యవేక్షకునిగా పనిచేశాడు. ఇప్పుడు అతని ప్రజ్ఞ, అనుభవాలే అతనికి శత్రువులుగా అయినవి. మూడు సంవత్సరాల క్రితం రాజుగారి కుమార్తె మరణించింది. అప్పుడు ఆమె యొక్క సమాధికి సంబం ధించిన కట్టుబడి అంతా థేమాను యొక్క పర్యవేక్షణలో జరిగింది. గత సంవత్సరంలో దొంగలు ఆమె యొక్క సమాధి ద్వారము యొక్క రహస్యం ఛేధించి అందులోని నగలు అన్నీ దోచుకొని పోయారు. ఆ సమాధి యొక్క ద్వారము యొక్క రహస్యం థేమానుకు మాత్రమే తెలుసు కనుక థేమానును నేరస్తునిగా తీర్మానించి, రెండు నెలలుగా రహస్య మందిరంలో బంధించి చిత్ర హింసలకు గురిచేసి, చివరికి విసికిపోయి ప్రాణం పోయే పరిస్థితులలో రాజుగారి ఖైదీలు ఉంచబడే చెరసాలలో వేశారు. ఇప్పుడు యోసేపు వలన రక్షింపబడిన థేమాను యోసేపుకు చెరసాల నిర్వహణలో కుడిభుజమువంటి వాడయ్యాడు.

ఒకరాత్రి యోసేపు థేమానుతో మాట్లాడుతూ "నీవు కట్టించిన రాజకుమార్తె సమాధి రహస్యం ఎలా బయటపడి ఉంటుంది?" అని అడిగాడు. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

21

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

"దేవా నీ నామమునుబట్టి నన్ను రక్షింపుము.

నీ పరాక్రమమునుబట్టి నన్ను రక్షింపుము.

నీ పరాక్రమమునుబట్టి నాకు న్యాయము తీర్చుము.

నా నోటి మాటలు చెవిని బెట్టుము"

అని తనలో తాను పాడుకోవడం మొదలుపెట్టాడు. పైకి చూసాడు. కావలి వాడు ఏదో సైగ చేస్తున్నాడు.

నెతనేలును పిలిచి "కాపలావాని సైగ ఏమిటి?" అన్నాడు దావీదు.

"గిబియా నుండి సౌలుకు ఏదో అత్యవసరమైన వార్తతో వార్తాహరుడు వస్తున్నాడు" అని చెప్పాడు నెతనేలు.

మరలా సౌలు సైన్యాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి అనే సంకేతం. దావీదు తన జనులను విశ్రాంతి తీసుకోవలసినదిగా చెప్పమని అబీషైకి చెప్పాడు. అబీషై గుఱ్ఱం ఎక్కి వెళ్ళిపోయాడు. అరగంట తర్వాత సంకేతం సౌలు తన సైన్యంతో మాయోను అరణ్యంలో నుండి బయలు వెళుతున్నాడు.

దావీదుకు అర్ధం కాలేదు. ఒక గంట తర్వాత సౌలు సైన్యమంతా మాయోను అరణ్యంలో నుండి ఉత్తరం తట్టు వేగంగా వెడలిపోవటం చూసి ప్రక్కనున్న రద్దయి, ఓజీము అన్నలతో "సెలహమ్మలెకోతు నా విషయం అనుకున్నాను కాని అది సౌలు కొరకు అని అనుకోలేదు" అన్నాడు.

"ఇదిగో దేవుడే నాకు సహాయకుడు. ప్రభువే నా ప్రాణమును, ఆదరించువాడు నా శత్రువులు చేయు కీడు ఆయన వారి మీదికి రప్పించును. ఇది విశ్రాంతి" అని కూర్చున్నాడు. నాలుగు రోజుల తర్వాత దావీదు మృత సముద్రం పడమర ఒడ్డున ఉన్న ఏన్గెది కొండలలోకి మకాం మార్చాడు. పదిరోజుల తర్వాత షేలహు ఏన్గెదీలో దావీదును కలుసుకున్నాడు. షేలహును చూచినపుడల్లా దావీదుకు ఏలా లోయ గుర్తుకు వస్తుంది. ఆనాటి జయోత్సాహము.

"పదిరోజుల నుండి ఎన్నోసార్లు మిమ్ములను కలుసుకోవటానికి రావాలనుకున్నాను. కాని సౌలు ఫిలిష్తీయులతో యుద్ధంలో ఉన్నారుకదా!" అని చెప్పాడు షేలహు.

"ఫిలిష్తీయులతో యుద్ధమా?" అన్నాడు దావీదు.

"ఔను అప్పుడు మిమ్ములను మాయోను అరణ్యంలో తరుముచున్నప్పుడు ఇంకొక అరగంట తరిమినట్లయితే మీరు దొరికిపోయి ఉండేవారు. కాని ఫిలిష్తీయులు దండెత్తి వచ్చిన వార్త ఆ క్షణంలోనే సౌలుకు అందినది. అందువలన మిమ్ములను వదలి గిబియా వచ్చేసాడు" అని చెప్పాడు షేలహు. "యెహోవా నీ నామము ఉత్తమము. నేను దానికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" అన్నాడు కళ్ళు మూసుకొని.

"సౌలు రాజు ఇశ్రాయేలీయులలో శ్రేష్ఠులైన మూడువేల మందిని ఏర్పరచుకొని ఇక్కడికి రావడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అందుకే నేను వచ్చాను అన్నాడు.

"ఎంతకాలం పడుతుంది?" అన్నాడు దావీదు.

"నాలుగైయిదు రోజులు" అన్నాడు షేలహు.

"ఏన్గెదీ కొండలలో తిరగటం అంత తేలిక కాదు" అన్నాడు దావీదు.

కొండమేకలు మాత్రమే ఆ కొండలలో తిరగగలవు. తన జనులలో యౌవ్వనులను మాత్రమే తన దగ్గర ఉంచుకొని మిగిలిన వాళ్ళను మాయోను అరణ్యములో ఉంచాడు.

సౌలు మూడు వేలమందితో ఏన్గెదీ కొండలలో బస చేశాడు. ఎంత వెదికినా దావీదు జాడ తెలియలేదు.

ఆ కొండలలో అతిపెద్దదైన గుహ సుమారు ఐదువేల మంది బస చేయుటకు వీలుగా ఉన్నది. అది పామువలె మెలికలు తిరిగి చాలా పొడవుగా ఉంటుంది. దావీదు తన దగ్గరున్న యవ్వనులైన వారితో గుహ లోపలనే రెండు రోజులుగా ఉంటున్నాడు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండి, బండలు ఎర్రగా కాలిన ఇనుము రంగులో ఉన్నాయి. నెతనేలు పరిగెత్తుతూ గుహలో ప్రవేశించాడు. అంతవరకు

గుహప్రక్కన ఉన్న చెట్ల గుబురులో కూర్చోని గుహకు ముప్పై గజాల దూరంలో సౌలు యొక్క కదలికలు గమనిస్తున్నాడు. సౌలు అతని సైన్యం రెండు రోజులుగా అక్కడే దండు దిగియున్నందు వలన గుహలోని దావీదు అతని ముఖ్య అనుచరులు గుహలో ఉండిపోయారు. సౌలు దండు అక్కడ నుండి కదలితేనే కాని వీరు బయటకు రావడానికి వీలుకాదు నెతనేలు, అబీషై, ఇంక కొందరు కాపు కాస్తున్నారు.

నెతనేలు గుహ లోపలకి వచ్చి

"సౌలు ఒక అరగంట నుండి తన ఎత్తులో ఉన్న ఈ గుహ వైపు మాటిమాటికి చూస్తూ ఉన్నాడు. ఇప్పుడు ఇద్దరు అనుచరులతో ఈ గుహ వైపుగా వస్తున్నాడు. వారిలో ఒకని దగ్గర కూజాలో నీళ్ళు ఉన్నాయి" అన్నాడు.

దావీదు ఎవరిని మాట్లాడవద్దని గుహముందు భాగము వైపుగా నడవటం మొదలుపెట్టాడు. అతని అనుచరులు కొంచెందూరంగా వెంబడిస్తున్నారు. అంత ఎండకాస్తున్నా గుహలో కటిక చీకటి ఉన్నది. గుహ ద్వారమునకు ఇంక ఒక మెలిక వుండగా దావీదు వంగి చూసి ఆగిపోయాడు. సౌలు రాజు అక్కడ శంకానివర్తికై కూర్చున్నాడు. అతని పైవస్త్రము తీసి ప్రక్కన కొంచెం వెనుకగా పెట్టియున్నాడు. గుహ వాకిలి దగ్గర ఇద్దరు సైనికులు అటు తిరిగి యీటెలు పట్టుకొని నిలుచున్నారు. వెంటనే రద్దయి, ఓజేము దావీదును ఎడమ చేయి పట్టుకొని వెనుకకు లాగి గుహ లోపలికి తీసుకొని వెళ్ళారు అందరూ గుండ్రంగా నిలుచున్నారు. రద్దయి "అదిగో నీ దృష్టికి ఏది మంచిదో అది నీవు చేయునట్లు నీ శత్రువుని నీ చేతికి అప్పగింతునని యెహోవా నీతో చెప్పిన దినము వచ్చెను" అన్నాడు.

దావీదు ఏమి మాట్లాడలేదు. తన కత్తి నడుముకు కట్టిన ఒర నుండి బయటకు లాగి కుడిచేత పట్టుకొని "మీరందరూ ఇక్కడ నుండి కదలవద్దు" అని ఖండితంగా చెప్పి గుహ ముందు భాగమునకు నడిచి మలుపు తిరిగిన తర్వాత తన సహచరులతో కనుమరుగయ్యాడు. ముందు తాను నిలుచుని సౌలుని చూచిన చోటికి వచ్చి వంగి సౌలు యొక్క పైవస్త్రపు చెంగును ఒక మూరెడు కోసి లేచి గుహలోనికి వచ్చాడు.

నెత్తుట తడిసిన ఖడ్గంతో వస్తాడనుకున్న పదిమందికి చేతిలో మెరుస్తున్న పైవస్త్రపు చెంగుతో వచ్చిన దావీదును చూడగానే ఒక రకమైన కోపము, నిరాశ, నిస్పృహ కలిగాయి.

మూడవ అన్న అయిన షమ్మా దావీదు మీద కొంచెం చనువు ఉంది. ఎక్కువ ప్రేమ ఉన్నది. "దావీ, నువ్వు చేసిన పని ఏమిటి? దేవుని చిత్తానికి వ్యతిరేకముగా చేస్తావా? ఇప్పుడు నీ చేతికి దేవుడు అప్పగించిన నీ శత్రువును వదలి వచ్చావా?" అన్నాడు కఠినంగా.

"అది కాదన్నా, రాజు యొక్క పైవస్త్రమును కోసినందుకే నా మనస్సులో బాధపడుతున్నాను. అతడు యెహోవా చేత అభిషేకము నొందినవాడు గనుక యెహోవా చేత అభిషిక్తుడైన నా ప్రభువునకు నేను ఈ కార్యం చేయను. యెహోవాను బట్టి నేనతనిని చంపను" అన్నాడు దావీదు.

"సమూయేలుగారు నిన్ను రాజుగా అభిషేకించగానే సౌలు యొక్క అభిషేకము రద్దయింది. నీకు అతనంటే చుట్టరికపు ప్రేమ ఉన్నంత మాత్రమున నీవు చంపకపోతే మేము చంపక మానుదుమా!" అన్నాడు యాషాబాను.

అబీషై దావీదు ప్రక్కగా కత్తిచేత పట్టుకొని ముందుకు వెళ్ళటానికి ప్రయత్నించాడు. అబీషైని ఆనుకొని దోదో కూడా బయలుదేరాడు.

"నామాట వినండి దేవుని యుద్ధములు మనం చెయ్యాలి. మన బలప్రదర్శన కాదు. మీరు చెప్పినట్లుగా సౌలును నేను చంపటానికి దేవుడు ఇక్కడికి పంపించి యుంటే అతను శంకానివర్తి కోసం ఇక్కడికి రాడు. అతనికి కాదు ఇది దేవుడు మనకు పెట్టిన పరీక్ష" అని అన్నాడు. మరలా గుహ ముందుకు నడిస్తే సౌలు గుహలో నుండి బయటకు వెళ్తున్నాడు. అతని పైవస్త్రం అతని మీద ఉన్నది. దావీదు తేలికగా నిట్టూర్చాడు. తన చేతిలో సౌలు వస్త్రపు చెంగు చూచాడు. గుహ వెలుపలికి వచ్చాడు. కుడిప్రక్కన మెట్లులాగ చెక్కబడి ఉన్నాయి. వాటిమీదుగా వెళ్ళి గుహపై భాగమునకు వచ్చాడు. ఇప్పుడు సౌలు తన సైన్యమునకు దగ్గరగా వచ్చాడు.

**(సశేషం)**



# 'నేనంటే నేనే...'



'నేను' అనుకొనే స్థాయికి వచ్చినప్పటి నుండి మనిషి జీవితం ప్రారంభమవుతుంది. 'నేను' అనే భావన మనిషిని ఎప్పటికీ తగ్గించుకొనేలా చేయదు. 'నేనంటే నేనే' 'నాకు తిరుగులేదు' అని ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ బాగానే చంకలు గుద్దుకున్నాడు. ప్రపంచాన్నయితే జయించగలిగాడు గానీ తనకు వచ్చిన రోగాన్ని మాత్రం జయించలేక చతికిలపడి చనిపోయాడు. మనుష్యులందరికీ ఉన్న పెద్ద జబ్బు 'నేను' అనుకోవడం. అలా 'నేను' అనుకోగానే తామేదో వీరులు, శూరులు, తోపులు, తురుములు అనుకుంటుంటారు. కష్టాలు, బాధలు, సమస్యలు, రోగాలు, రొష్టులు రానంతకాలం నెత్తి మీద కిరీటం లేకపోయినా అందరూ 'అలెగ్జాండర్ ది గ్రేట్'లాగా ఫీలై పోతుంటారు. దేవుడిచ్చిన ఆరోగ్యము, తెలివితేటలను పెట్టుబడిగా పెట్టి 'నేను' అనే కిరీటం కొనుక్కొని నెత్తిన పెట్టుకొని విర్రవీగుతుంటారు. మనం మాట్లాడేటప్పుడు నేను అని చెప్పేదాంట్లో మన ఉనికిని చాటుకుంటాము. కానీ హృదయములో 'నేను' అనుకొనేది గర్వము, అహంకారముతో కూడుకొని ఉంటుంది. 'నేను' అనుకోవడంలో మనిషికి స్వార్థం వస్తుంది. 'నేను' 'నాది' అనుకోవడం వలన మనిషి జీవితంలో దేవునికి ప్రాముఖ్యత లేకుండా పోతుంది. 'నేను' అనేది శాశ్వతం కాదు మట్టిలో కలిసి పోయేది. 'నేను' అన్న పదము దేవునికి మాత్రమే చెందుతుంది. ఎందుకంటే ఆయన శాశ్వతముగా ఉండేవాడు. దేవుడు మోషేతో మాట్లాడుతూ 'నేను ఉన్నవాడను' అని చెప్పాడు. మనిషి తల్లి గర్భంలో నుండి పరిపూర్ణ ఆరోగ్యవంతుడుగా జన్మించిన తర్వాత 'నేను' అనుకొనేంత వయస్సు వచ్చే వరకు జీవించి వుండటమే దేవుని కృప. దేవుడు తన కృపాకనికరములతో మనిషిని పరిపూర్ణ మానవునిగా పుట్టించిన తర్వాత, ఆ మనిషి తాను వ్యక్తిగతంగా ఆ స్థాయికి, అంటే 'నేను' అనుకొనగలిగే స్థాయి రావడానికి దేవుడే కారణమని గుర్తెరగక పోవడం వలన 'నేను' అన్న స్థాయిని తనకు తాను అన్వయించుకుంటున్నాడు. అంటే ఆ 'నేను' అనుకొనగలిగే స్థాయికి రావడానికి తానే కారణం అనుకుంటున్నాడు. 'ఇకను జీవించువాడను 'నేను' కాను, అని ఎవరైతే అనుకుంటారో వారు క్రీస్తుతో కూడా సిలువ వేయబడి 'నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసము వలన జీవించు చున్నాను' (గలతీ. 2:20) అని అనుకొనే స్థాయికి వస్తారు. అప్పుడు వారిలో గర్వము, అహంకారములాంటి లక్షణాలు కొంచెమైనా కనబడవు. ఎందుకంటే వారిలో నివసించేది క్రీస్తు కాబట్టి. అపొస్తలుడైన పౌలు చాలా గొప్పవాడు. ఆయన యేసుని ఎరుగక ముందు చాలా గొప్ప పేరు సంపాదించాడు. యేసును తెలుసుకున్న తరువాత 'నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము, మీరును నన్ను పోలి నడుచు కొనుడి' (1కొరింథీ. 11:1) అని చెప్పగలిగే స్థాయిని సంపాదిం చుకున్నాడు. అంతటి గొప్ప వ్యక్తి 'ఇకను జీవించవాడను నేను కాను' అన్నాడంటే, మరి మన స్థాయి ఏంటి? ఈ భూమి మీద జీవించే వారిలో శరీరానికి విలువ ఇచ్చే ప్రతిఒక్కరూ 'నేను' అనుకొనే స్థాయి నుండి ఎప్పటికీ బయటకు రాలేరు. తనను తాను హెచ్చించు కొనిన అలెగ్జాండర్ ది గ్రేట్‌లా 'నేనంటే నేనే' అని విర్ర వీగే వారి గతి ఎలా ఉంటుందో వారి చావు నిర్ణయిస్తుంది. మీరు క్రీస్తుతో కూడా సిలువ వేయబడి, ఇకను జీవించు వాడను 'నేను' కాను అని అపొస్తలుడైన పౌలులా తగ్గించుకొని జీవించగలిగే స్థాయి మీకు ఉందో లేదో పరీక్షించుకోండి.


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# శిష్యత్వము

ప్రియమైన సోదర సోదరీమణులకు ప్రభువునందు నా శుభములు... దేవుని ప్రేమ, కృపనుబట్టి అందరూ బాగున్నారని నమ్ముచున్నాను...

ఒక వ్యక్తి తాను పాపి అని, తప్పిపోయిన వాడని, గుడ్డివాడని, దేవునియందు దిగంబరుడని గుర్తెరిగినప్పుడు, తన స్థానంలో యేసుక్రీస్తు ప్రభువు సిలువపై మరణించాడు అని విశ్వసించినప్పుడు, అతడు ఒక నిజ క్రైస్తవుడు అవుతాడు. ఆ తర్వాత మాత్రమే నిజ శిష్యత్వానికి కాలిబాట ఆరంభం అవుతుంది.

శిష్యత్వ జీవితం ఒక సహజాతీతమైన జీవితం, అందుకు కొన్ని శిష్యత్వపు నియమాలు పాటించడం ఒక క్రైస్తవునికి ఎంతో అవసరం. మన లోకరక్షకుడు నియమించిన శిష్యత్వపు నిబంధనలు ఏవనగా.....

మొదటగా యేసుక్రీస్తు కోసం అత్యున్నతమైన ప్రేమ కలిగి ఉండాలి. "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను... తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:26). అందరికంటే ఎక్కువగా మన హృదయాల్లో దేవునికి స్థానం ఇవ్వాలి, అంటే బంధువుల యెడల భయంకర శత్రుత్వంతో నిండి ఉండాలనేది భావం కాదు, క్రీస్తుపై మనకున్న ప్రేమతో పోల్చినప్పుడు ఇతర ప్రేమలన్నీ ద్వేషంగానే కనపడాలి.

రెండవదిగా, క్రీస్తుకు చెందిన వారందరిపై అచంచల ప్రేమ చూపవలెను. మీరు ఒకని యెడల ఒకడు ప్రేమ గలవారైన యెడల దీనినిబట్టి మీరు నా శిష్యులని అందరూ తెలుసుకొందురు ఇతరులను తనకంటే ఉన్నతంగా హెచ్చించే ప్రేమ ఇది (యోహాను 13:35).

మూడవదిగా, ఎవడైనను నన్ను వెంబడింప గోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని... (మత్తయి 16:24). స్వయం ఉపేక్ష అంటే క్రీస్తు అధికారానికి సంపూర్ణంగా మనలను అప్పగించుకొనుట. శిష్యత్వం ఎదుర్కొనే ఆటంకాలలో అత్యంత కీలకమైనది స్వయం ప్రీతి. అంటే ఇంకెంత మాత్రము మానవ అహానికి హక్కులు గాని, అధికారాలు గాని ఉండనే ఉండవు, దేవుని చిత్తానికి సంపూర్ణంగా అప్పగించుకోవాలి.

నాలుగవదిగా, ఎవడైనను నా వెంబడి రాగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలెను. సిలువ అంటే ఏదో ఒక శరీర రుగ్మత కాదు, సిలువ అనేది బాహాటంగా ఎంచుకునే జీవన బాట.... యేసుప్రభువు జీవిత స్వభావాన్ని కలిగి ఉండటం.

ఐదవదిగా, "మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి..." (యోహాను 8:31). ఆరాధించడం కంటే చివరిదాకా నిలిచి ఉండటం ముఖ్యం. నాగటి మీద చేయి పెట్టి వెనుక తట్టు చూచువాడు దేవుని రాజ్యమునకు అర్హుడు కాడు.. (లూకా 9:62).

ఆరవదిగా, ఆయనను వెంబడించుట కోసం సమస్త మును విడిచిపెట్టుట... ఆ ప్రకారమే మీలో తనకు కలిగిన దంతయు విడిచిపెట్టనివాడు, నా శిష్యుడు కానే కానేరడు (లూకా 14:33).

యేసుప్రభువుకు శిష్యుడుగా ఉండాలనుకున్నవాడు అన్నిటిని విడిచిపెట్టాలి. ఈ సత్యము యొక్క తీవ్రతను మనమెంత అభ్యంతరపరిచినప్పటికీ, ఇది ప్రభువు వాక్కు అనే వాస్తవం మాత్రం అలాగే మిగిలిపోతుంది. శిష్యులకు యేసుక్రీస్తు అప్పగించిన గొప్ప పని ఏదనగా, యేసు తన శిష్యులకు, సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి... (మార్కు 16:15). మీరు వెళ్ళి అన్ని దేశముల నుండి శిష్యులను చేయుడి... (మత్తయి 28:19) అని వారికి ఆజ్ఞాపించెను.

ఈ జీవితాన్ని అనుభవపూర్వకంగా జీవించుటకు అవసరమైనంత దైవశక్తి మనకు ఎంతో అవసరం, ఈ విధంగా మనమందరము యేసుప్రభువు శిష్యులవలె ఈ లోకంలో పని చేయుదుము. ఆయన రాజ్యంలో పని చేయుటకు దేవుడు మనందరికీ సహాయము చేయను గాక... ఆమేన్!

# మధ్యకాలము

అంతియొకస్ అతనికి వ్యతిరేకంగా వచ్చుచున్న సమరియ సైన్యమును ఎదుర్కొనుటకు అపోల్లోనియస్‌ను పంపించెను. కాని అతడు చంపబడెను, మరియు అతని సమూహమంతయు ఒక యవ్వన సైన్యాధిపతి వలన ఓడింపబడి చంపబడెను. అపోల్లోనీయస్ కత్తి వారి మధ్య పడియుండుట చూచి యూదా దానిని తీసికొని సామాన్యంగా దానితోనే పోరాడేవాడు.

ఈ వార్త కాలొసిరియా ప్రాంతమునకు వ్యాపించగా నెరాను అను ప్రాంతపు ఉప అధ్యక్షుడు తన బలమంతటిని ప్రోగు చేసుకొని అపోల్లోనియస్ మరణమునకు ప్రతీకారం తీర్చుకొనుటకు బయలుదేరెను. కాని అతను కూడా అపోల్లోనియస్‌వలెనే మరణించాడు. అంతియోకస్ ఈ ఓటమి వలన బహు కలవరము కల్గిన వాడై 40,000 కాల్బలము, 7,000 గుర్రములను అనేకులైన చుట్టుప్రక్కల దేశస్థులైన ప్రజలను మార్పునొందిన యూదులతో కలిసి క్రీ॥పూ॥ 162లో టోలమీ మాక్రాన్, నికోనార్ మరియు జార్జియాస్ అను సైన్యాధ్యక్షులతో యూదయపై దండయాత్రకు ఆజ్ఞ జారీ చేశాడు.

వారు యెరూషలేమునకు ఏడు మైళ్ళ దూరంలో ఉన్న ఎమ్మాయి గ్రామము వరకు వచ్చినప్పుడు ఆ సమయంలో యూదా యెరూషలేమును ముట్టడి వేయుచుండగా అన్యుల చేత మిస్పా పట్టణమునకు త్రోలివేయబడెను. ఇక్కడ సైన్యమంతయు వారే దేవతలని చెప్పుకొనిరి. యూదా వారందరిని వారి మతము కొరకు, చట్టము కొరకు, స్వతంత్రము కొరకు తీవ్రముగా హెచ్చరించెను. కాని చివరకు ఒక సంవత్సర కాలంలోపల పెండ్లి చేసికొనిన వారిని ఇండ్లు కట్టించుకొనిన వారిని ఏ మాత్రము భయపడినట్లు కనిపించినా వారందరిని సైన్యము నుండి పంపివేసెను.

ఏమైనప్పటికినీ అతను (యూదా) శత్రువుతో యుద్ధము వదలి వేయుటకు నిశ్చయించుకొనెను. కాని ఈ మధ్యలోనే దేవుడు అతనికి సులువైన విజయము అనుగ్రహించెను. జార్జియాస్ 5 వేల కాల్బలముతో, వెయ్యి గుర్రములతో రాత్రి వేళ అతని చిన్న సైన్యమును భయపెట్టుటకు సైన్యము నుండి విడివడిగా యూదా ఆ విషయము తెలిసిన వాడై మరొక మార్గముగుండా ప్రయాణము సాగించి జార్జియాస్ లేని సమయమందు సైనిక దళముపై పడి మూడువేల మంది పురుషులను హతమార్చి మిగిలిన వారు పారిపోవునట్లు చేసి గుడారమును ముట్టడి వేసెను. జార్జియాస్ గుడారమునందు యూదులు లేకపోవుట చూచి బహుశా వారు రక్షణ కొరకై పారిపోయి ఉందురని తలంచుచు పర్వతములపైకి వచ్చెను. కాని అక్కడ వారిని కనుగొనకపోవుట చేత తిరిగి వచ్చు సమయమున జరిగిన సంఘటనను చూచి ఆశ్చర్యచకితుడాయెను. వారు యూదా తమకు ఘనస్వాగతమిచ్చునని తలచి మైదానములో నిలువబడి యుండగా యూదా వారిని తరిమి వెంటాడి ఆరువేల మందిని హతమార్చి మిగిలిన వారిలో అనేకమందిని గాయపరచి వికలాంగులను చేసెను. ఈ విజయము వలన యూదాకు యెరూషలేము ద్వారములు తెరువబడెను. గనుక అతడును అతని సైన్యమును మరుసటి దినమైన సబ్బాతు దినమందు గొప్ప భక్తి కృతజ్ఞతలతో విజయోత్సాహము చేసుకొనిరి.

తిమోతియస్, బక్కిదెస్ అను వారిద్దరు అంతియోకస్ ఆధ్వర్యంలో గవర్నర్లుగా ఉండిరి. ఈ సమయంలో వారు జార్జియాస్ సహాయమునకై వెళ్ళి యూదా బలప్రభావము వలన బలైపోయిరి. యూదా శత్రుసైన్యము నుండి బలమైన మంచి యోధులను కొనిపోయి యుద్ధమునకు వాడుకొనెను. పాడైపోయిన వారి వస్తువులను దోచుకొని పోయెను. ఈ ఓటమి యూఫ్రటీసు నది ప్రక్కనున్న దేశమంతటికి గవర్నరైన లిసియాన్‌ను కూడా వెంబడించెను. యెరూషలేముకు 20 మైళ్ళ దూరములో ఉన్న బెత్‌జురా దుర్గము వరకు చొచ్చుకొని పోయెను. అతడు తన అరవై వేల కాల్బలము ఐదువేల గుర్రములతో దేశమును నాశనం చేస్తానని భయపెట్టెను కాని అతడు యూదా అతని అనుచరులైన పదివేలమంది పురుషులచేత ఊరకనే ఓడిపోయెను.

**(సశేషం)**

# కొడవటికంటిగారి సాక్ష్యము

2000 సంవత్సరము జనవరి 10వ తేదీన నా కళ్ళు పచ్చగా ఉన్నాయని యింటికి దగ్గర్లో ఉన్న రాంబాబు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళాను. రక్తము 2 శాతం మాత్రమే ఉంది అని మందులు వ్రాశారు. పది రోజుల్లో నయమైంది.

ఫిబ్రవరి 8న మరలా నా కళ్ళు పచ్చగా ఉన్నాయిని చెప్పి ఆసుపత్రికి వెళ్ళాను. పసికర్లు వచ్చిన వాళ్ళంతా భయపడి చస్తారు. డాక్టరు వద్దకు వెళ్తే కఠినమైన భోజన ఆంక్షలు పెట్టి మజ్జిగ మాత్రమే త్రాగి ఉండాలని అంటారు. శరీరంలోని జబ్బును ఎదుర్కోటానికి శక్తి ఆహారంలో వస్తుంది. అదే తగ్గిపోతుందులే అని డాక్టరు దగ్గరకు వెళ్ళకుండా, పథ్యం చేయకుండా నెల రోజులు వున్నాను.

ఒకరోజు మధ్యాహ్నం నా స్నేహితుడు గవర్నమెంటు హాస్పిటల్లో కంటి వైద్యుడైన డాక్టరు మురళి వచ్చి, నా కళ్ళు చూచి ఆశ్చర్యపోయాడు. నెల రోజుల నుండి నువ్వు నన్ను చూడటానికి రాలేదు. సంగతి ఏమిటో కనుక్కుందామని వచ్చాను అన్నాడు. వెంటనే ఆయన బండి మీద గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకెళ్ళి నన్ను చేర్పించాడు. నెల రోజులు అక్కడ ఉన్నాను కాని ఏ మాత్రం నయం కాలేదు. నా తమ్ముడు జోషి ఇంటికి తీసుకొని వచ్చి స్టేషన్ దగ్గర వున్న చలపతి అనే నాటువైద్యుని పిలిపించాడు. ఆయన నెల రోజులు వైద్యం చేశాడు. ప్రతిరోజు గంధం నూరించి ముద్దలు మింగించేవాడు. ఇంకా ఏవో చూర్ణాలు మింగించాడు. కడుపు రోజురోజుకి పెరిగి పెద్దదై ప్యాంటు వేసికోలేక పోయాను.

అక్కడ నుండి నల్లూరి నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాను. అప్పటికి నాలుగు నెలలు గడిచిపోయాయి. నర్సింగ్ హోమ్ వారు ఒక నెల మందులు వాడి మద్రాసుకాని హైదరాబాద్ కాని అపోలో హాస్పిటల్‌కి వెళ్ళండి ఇక్కడ నయం కాదు అన్నారు. కాని నేను ఆ ప్రయత్నమే చేయలేదు. అపోలోకి వెళ్ళాలంటే ఎంత తక్కువ అయినా 50 వేలు అవుతుంది. నేను అప్పు చెయ్యను, చందా అడుగలేను. అప్పటికి నాకు 60 సంవత్సరాలు. సగం ప్రపంచం తిరిగాను. స్వదేశంలో ముప్పాతిక భాగం చూశాను. ఆరు నవలలు రాశాను. 9 మంది పిల్లలు వున్నారు. వారందరూ పెద్దవాళ్ళయి ఎవరి కాళ్ళ మీద వాళ్లు బ్రతుకుతున్నారు. ఇంక నేను చనిపోయినా అంతగా బాధపడే వాళ్ళు ఎవరూ లేరు. అప్పు చేసి చచ్చిపోతే ఎంత అసహ్యం?

మా తమ్ముడు జోషి తన కారు ఇచ్చి కొద్దిగా డబ్బు ఇచ్చి హైదరాబాద్ పంపించాడు. ఆ డబ్బుతో అపోలో గేటు వద్దకు కూడ పోలేము. హైదారాబాద్ నుండి తిరిగి వచ్చిన తర్వాత ఇంకా బలహీనమయ్యాను. ఇంట్లో మనుష్యులు ఒక ప్రక్క పిలిస్తే ఇంకొక ప్రక్కకి పోతున్నారు. అయిదు నెలలు మంచంలో వున్నవారు ఎవరైనా అప్పులకు బరువే. నేనైనా అంతేకదా! చనిపోయిన మా అమ్మ గుర్తుకు వచ్చేది. రాత్రులు పెద్దగా అరిచే వాడిని. మా అమ్మ వెళ్లిపోయి హాయిగా వుంది. మా నాయన అమ్మ ఇద్దరు హాయిగా వెళ్లిపోయారు. ఇప్పుడు నా కడుపునిండా కత్తులు వున్నట్లుగా ఉండేది. అటు కదిలినా ఇటు కదిలినా విపరీతమైన నొప్పి.

నాకు మొదటిసారి జాండిస్ వచ్చినప్పుడు జనవరిలో పరీక్ష చేసిన రాంబాబు దగ్గరికి సాయంకాలం 6 గంటలకు వెళ్ళాను. ఆయన మూత్రంపట్టి తెమ్మన్నాడు. చీకటి పడుతుంది. నేను మూత్రంపట్టి డాక్టరు దగ్గరు తీసుకెళ్తున్నాను. డాక్టరు దూరం నుండి ఆ మూత్రం రంగు చూసి అక్కడే పెట్టు అని, నా కుమారుని లోపలికి తీసుకెళ్లి వెళ్లి మీ నాన్న రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకడు, ఇంక పరీక్షలు అవసరం లేదు అని పంపించాడు. 13 సంవత్సరాలు క్రితం ఆ డాక్టరు మా నాయనను పరీక్షించి గుండె పెద్దదయింది. ఇంక రెండు నెలల కంటే ఎక్కువ బ్రతకడు అని చెప్పాడు. అలానే మా నాయన చనిపోయాడు. ఇప్పుడు నేను రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకనని చెప్పాడు.

ఇంటికి వచ్చిన తర్వాత ఆ సంగతి అందరికి తెలిసి పోయింది. నేను రెండు రోజులే బ్రతుకుతానని. వెంటనే నా కుమారుడు డబ్బు తేవడానికి బెంగుళూరు వెళ్ళాడు. చనిపోయే ముందు నన్ను చూడటానికి దూర ప్రాంతాల నుండి బంధువులు స్నేహితులు రావటం ప్రారంభించారు. నేను ఏ మాత్రం ఆలోచించటం లేదు. భయపడలేదు, దిగులుపడలేదు.

మా ప్రక్క నాలుగంతస్తుల ఇల్లు మా తమ్ముడు జోసఫ్ ఇంట్లో ఎప్పుడూ ఎవరో ఒకరు ఇద్దరు, పదిమంది, పాతిక మందైనా తెల్లవాళ్లు వుంటారు. వారిలో ఇద్దరు ఆడవాళ్లు

ఉన్నారు. వారిలో ఒకామెకు స్వస్థతవరం వుందంట. కాని ఆమెను ప్రార్ధన చెయ్యమని అడుగలేదు. పైగా యేసుప్రభువుకు రికమండేషనా అనుకునే వాడ్ని. ఆయన చిత్తమైతే బ్రతుకుతాను లేకుంటే లేదనుకునేవాడిని. ఆ ఉదయం ప్రక్కింట్లో వున్న అమెరికా ఆమె జానెట్ 'నేను వచ్చి ప్రార్ధన చేసేదా?' అని కబురు చేసింది. సంతోషంగా రండి అని కబురు చేశాను కాని ఆమె రాలేదు.

మరునాడు సాయంకాలం మిద్దెమీద పిట్ట గోడకి మంచం ఆనిచ్చి కూర్చుని క్రిందకు చూస్తున్నాను. ఎదురుగా మా చర్చి తలుపులు మూసి వున్నాయి. చీకటి పడుతుంది. పిట్టగోడమీద తొట్లలో పూలచెట్లు వున్నాయి. నేను చర్చీని చూస్తున్నాను. నాకు పెద్ద కడుపు, పెద్ద లివర్. అంతలో భళ్ళున చర్చీ తలుపులు తెరచుకొని జానెట్ బయటికి వచ్చింది. ఆమె వెంట నలుగురు ఆడవాళ్ళు వున్నారు. ఆమె వాళ్ళతో ఏదో మాట్లాడుతున్నది. నిన్న ఈమె వస్తానని చెప్పింది ఎందుకు రాలేదో అనుకున్నాను. ఇంతలో ఒక చిన్న పిల్లవాడు వచ్చి 'తెల్ల దొరసాని నీకు ప్రార్ధన చెయ్యటానికి వస్తుంది' అన్నాడు. 'సరే రమ్మను' అని చెప్పి, నేను చర్చీ వరండాలో నిలబడి వున్న జానెట్‌ని ఆ పల్లెటూరు ఆడవాళ్లని చూస్తూ ఉన్నాను.

అంతే నేను లేచి ఒక ఇంట్లోకి ప్రవేశించాను. లోపల పెద్ద హాలు. మధ్య తరగతి కుటుంబీకుల ఇల్లు. బీదవారు కాదు గొప్పవారు కాదు. కుడిప్రక్కకు చూశాను. అక్కడ యేసు ప్రభువు వున్నాడు. నేను ఇంటి లోపలికి వచ్చి కుడిప్రక్కకు చూసినప్పుడు యేసుప్రభువు యూదులు భోజనం చేసే పద్ధతిలో కూర్చుని వున్నాడు. ఎడమ చేతిమీద ఆనుకుని ఎడమవైపుకి పండుకున్నట్లుగా గోడకు కాళ్లు చాపి కుడిచేత్తో రొట్టె తింటున్నాడు. రొమ్మున ఆనుకొనిన శిష్యుడు, అనగా యేసుప్రభువు భోజనానికి పైవిధంగా కూర్చున్నప్పుడు యేసుప్రభువుతో మాట్లాడాలంటే యేసుప్రభువు రొమ్ముకు తన వీపు తగిలేటట్లుగా తిరగాలి. పరిసయ్యుని ఇంట్లో ప్రభువు ఈ విధంగానే భోజనమునకు కూర్చునప్పుడు పాపాత్మురాలైన స్త్రీ ఈ విధంగా భోజనానికి కూర్చుని వున్న యేసు పాదమును కన్నీటితో కడిగింది.

యేసుప్రభువు ఆ విధంగా రొట్టెతింటూ, నేను లోపలికి వచ్చినప్పుడు తలెత్తి నన్ను చూశాడు. 'వచ్చావా?' అన్నట్లుగా చూచి ఆ హాలు మధ్యలో చాప మీద కూర్చుని వున్న ఒక వ్యక్తితో ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్నాడు. నేను నా తల త్రిప్పి ఆ వ్యక్తిని చూడలేదు. యేసుప్రభువు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. కొంచెంసేపు నిలుచున్నాను. కడుపు ఎత్తుగా, కాళ్ళు చేతులు సన్నగా, కడుపు బరువుగా నొప్పి పుట్టింది. అక్కడే చూస్తూ కూర్చున్నాను. అప్పుడు ప్రభువు తలత్రిప్పి నన్ను చూసి మరలా ఆ హాలులో వున్న వ్యక్తితో ఏదో భాషలో మాట్లాడుతున్నాడు. నాకు ఆ భాష అర్ధంకాలేదు.

అంతలో నేను లోనికి వచ్చిన దారినే ఒక స్త్రీ నాకు, ప్రభువుకు మధ్యగా వచ్చి మరొక రొట్టె ఆయన ప్లేటులో పెట్టి వెళ్లింది. ఆమె కాళ్లు మాత్రం చూశాను. ఆమె ముఖం చూడలేదు. కాని వెంటనే ఆమె పేతురు అత్త అని, ప్రభువుకు పరిచర్య చేస్తుందని, ప్రభువు మాట్లాడుతుంది పేతురుతో అని, ఇది పేతురుగారి ఇల్లు అని గ్రహించాను.

తర్వాత ప్రభువు పరుపు మీద నా ఎదురుగా ఐదు అడుగుల దూరంలో కూర్చుని నన్ను చూస్తున్నాడు. నేను కూడ ఆయన ముఖాన్ని చూశాను. చిన్న గడ్డం, బలమైన శరీరం, గుండ్రని లేత ముఖం 30 సం॥ల యౌవనస్తుడు. తెల్లని అంగీ కొంచెం ఆకుపచ్చ రంగు. చాలాసేపు ఆయన కళ్ళలోకి చూస్తున్నాను. ఆయన కూడ నన్ను కన్ను ఆర్పకుండా చూస్తున్నాడు. దాదాపు పది నిమిషాలు ఏం మాట్లాడకుండా ఒకరినొకరం చూసుకుంటున్నాం. ప్రభువు నా గురించి ఏమి ఆలోచిస్తున్నాడో కాని, నేను మాత్రం ఆయన రూపురేఖలు చూస్తూ ఈయనది జపాన్ ముఖమా, చైనా ముఖమా? ఏదీ కాదు మన ముఖమే. ఆసియా వాసుల ముఖమే అని అలా ఆలోచిస్తున్నాను.

తర్వాత ఆయన లేచి నేను వచ్చిన వాకిట్లో గుండా వెళ్తున్నాడు. నేను లేచి ఆయనను అనుసరించాను. నా వెనుక పేతురుగారు వస్తున్నాడు. కాని నేను యేసు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. సాయంకాలం సూర్యుడు ఆయన వీపు మీద పడుతున్నాడు. ఇంట్లో లేతపచ్చరంగులో వున్న అంగీ ఇప్పుడు సూర్యకిరణాల వల్ల ముదురు ఆకుపచ్చరంగుకు వచ్చింది. ఇంటి ప్రక్కగా ముగ్గురం నడుస్తున్నాము. ఇంటి ముందు భాగమున పెద్ద వీధి. పట్టణమంతయు ఆ యింటి వాకిట కూడియున్నది. ఆయనను చూడగానే అంతా లేచి నిల్చున్నారు. కాని ఎవరూ గోల చెయ్యటం లేదు. ఇంటి చుట్టూ చెక్క ఫెన్సింగ్ వుంది. ఇంటిముందు గేటు ఎదురుగా ప్రభువు నిలుచున్నాడు. నేను ఆయన ఎడమ ప్రక్కన నిలుచున్నాను. నా ఎడమ ప్రక్కన పేతురుగారు నిలుచున్నాడు. అయినా

నేను పేతురుగారి ముఖం చూడలేదు. ప్రభువు ముఖం నుండి నా కన్నులు త్రిప్పలేదు. ఆయన తల త్రిప్పి నన్ను చూశాడు. నేను వెళ్ళి మా ఎదురుగా వున్న పెద్ద గేటు పైన వేయబడిన గడియ తీసి ప్రభువు వైపు చూస్తూ వచ్చి మామూలుగా ఇందాక నిలబడివున్న చోటనే నిలుచున్నాను. గేటులో నుండి లోనికి వచ్చిన ఒక యౌవనస్తుడు ప్రభువు ఎదురుగా నిలబడ్డాడు. ఆయన తన రెండు చేతులు ఆ యౌవనస్తుని కణతల మీద పెట్టి, తల పైకెత్తి చూస్తున్నాడు. ఎడమ ప్రక్కన నిలుచున్న నేను ఆయన ముఖం చూస్తూ నాలాగా యేసుప్రభువును ఇలా దగ్గరగా నిలిచి చూసే భాగ్యం లోకంలో ఎవరికీ కలుగలేదు అనుకున్నాను. ఆ రోగియైన యౌవనస్తుని రోగమంతా ప్రభువు తన శరీరంలోనికి తీసుకుంటు న్నాడు. ఆ యౌవనస్తుని ముఖం ఇప్పుడు తేటగా మారింది. ప్రభువు చేతులు అతని మీద నుండి తీస్తూ నావైపు చూశాడు. అతను స్వస్థత పొందినవాడై ప్రభువు కుడివైపుగా లోపలకి వెళ్ళాడు.

ఇంతలో చాలమంది మనుష్యులు పెద్ద పెద్దగా మాట్లాడుకుంటూ ధనధనమని మెట్లు ఎక్కుతున్న శబ్దం వినిపించి నా తలతిప్పి ఎడమవైపుకు చూశాను. నేను కూర్చున్న మంచము వెనుక క్రింద నుండి పైకి మెట్ల మీదుగా జానెట్ పైకి వచ్చింది. ఆమె వెనుక సూసన్, స్ట్రామాట్, పాస్టర్లు పైకి వచ్చారు. వారిని ముందు రానీయకుండా జానెట్ వారికి అడ్డంగా నిలబడి నావైపు వింతగా చూస్తుంది. ఆమె నన్ను అంతకుముందు చూచి ఉండ లేదు. ఆమె అలా ఎందుకు చూస్తుంది? అక్కడే ఎందుకు నిలబడిపోయింది అనుకుంటూ నా రెండు పాదాలు, కాళ్ళు, నా చేతులతో ఎత్తి ఇవతల పెట్టి లేచి నిలబడి ఆమె వైపుగా నడవడం ప్రారంభించాను. ఆమె వెంటనే కదిలి, నా వైపు వస్తూవుంది. కాని ఆమె మెడవంచి, కళ్ళు పైకెత్తి నన్ను పరీక్షగా చూస్తూ నా దగ్గరకు వస్తూఉంది.

ఈమె అలా ఎందుకు చూస్తూ వస్తుంది? అనుకుంటూ నేను కదిలాను. మేము ఒకరికొకరం దగ్గరగా వచ్చినప్పుడు ఆమె నా కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తూ 'ఇప్పటిదాకా నువ్వు ప్రభువు ఎదురుగా నిలబడి ఆయన కళ్ళలోకి చూస్తున్నావు కదూ!' అంది. ఔను కదా నేను ప్రభువు ముఖం చూస్తూ ఉన్నాను కదా అనుకున్నాను. "నువ్వు ప్రభువును చూస్తున్నావు. నేను కూడా మీ ఇద్దరిని చూశాను, కానీ నేను ప్రభువు వీపు మాత్రం చూస్తున్నాను. నువ్వు ఆయన ముఖం చూస్తున్నావు. ఈ లోకంలోని మరెవరూ ప్రభువు ముఖం చూడలేదు. నువ్వైతే నీ యీ కళ్ళతో ఆయనను చూస్తున్నావు. నేను వెనుక భాగం చూశాను ఆయన ముఖం చూడలేదు. నువ్వు ధన్యుడవు" అన్నది.

నేను లోపలికి నడచి సోఫాలో కూర్చుని నా ఎదురుగా వున్న కుర్చీలు చూపించి వారిని కూర్చోమన్నాను. ఆమె వెంటనే 'నేను కూర్చోను నువ్వు ప్రభువును చూశావుగా' అన్నది. అందరూ నిలబడే ఉన్నారు. ప్రార్ధన చెయ్యమని అడిగాను ఆమెని. 'నేను చెయ్యను, నువ్వు ప్రభువును చూశావుగా అన్నది. ఆమె ఎందుకు ప్రార్ధన చెయ్యనంది అనుకుంటూ వుంటే, ఆమె దగ్గరగా వచ్చి 'నీ కాళ్ళు కడుగుతాను' అంది. నేను ఆశ్చర్యపోయి స్ట్రామాట్‌ని 'ఈమె రోగికి ప్రార్ధన చేసేముందు వాళ్ళ కాళ్లు కడుగుతుందా?' అని అడిగాను. 'లేదు పెదనాన్న, ఈమెతో గత పదిరోజులుగా తిరుగుతున్నాము, ఆమె ఎవరి కాళ్ళూ కడగలేదు' అన్నాడు. మేము తెలుగులో మాట్లాడు కుంటుంటే నాకు ఇంగ్లీషు రాదనుకొని ఆమె స్ట్రామాట్ వైపు తిరిగి 'నేను మీ పెద్దనాయన కాళ్ళు కడుగుతానని ఆయనకి చెప్పండి' అన్నది. 'ఆయనకు ఇంగ్లీషు వచ్చు' అన్నాడు స్ట్రామాట్. నా కూతురు పెద్ద బేసిన్, ఓ జగ్గుతో నీళ్ళు తెచ్చి నా పాదాల మీద నీళ్ళు పోస్తుంటే జానెట్ నాకు ఎదురుగా నేలమీదకు వంగి నా రెండు మోకాళ్ళ నుండి పాదాల వరకు కడిగి లేచి నా ప్రక్కగా వచ్చి తన కుడి చేయి నా కుడి భుజం మీద వేసి నిలబడింది. మీరు ఏ దేశం నుండి వచ్చారు, ఎంతకాలం వుంటారు, మీ వయస్సెంత మొదలైన ప్రశ్నలు అడుగుతుంటే ఆమె జవాబు చెప్పి 'ఇక వెళ్తాము' అన్నది. 'ప్రార్ధన చేసి వెళ్లండి' అన్నాను. 'లేదు, నువ్వు నీ కళ్ళతో ప్రభువును చూశావు' అని ప్రక్కకి వెళ్ళి నా కుమార్తె ఆమె చేతుల మీద నీళ్లు పోస్తుండగా సబ్బుతో చేతులు కడుక్కుని వెళ్ళిపోయింది.

పెద్ద కడుపు, సన్నని కాళ్ళు చేతులతో నాకు ఏమి స్వస్థత కలుగలేదు. కదిలితే కడుపులో కత్తులు గుచ్చుకున్న నొప్పి. నా తమ్ముడు కొంతడబ్బు యిచ్చాడు. మరుసటిరోజు హైదరాబాద్ వెళ్ళి పరీక్ష చేయించుకొని వెంటనే ఒంగోలు రావాలి అనుకున్నాను. ఉదయాన్నే నా స్నేహితుడు డా॥ కృపారావుని చూసి సాయంకాలం హైదరాబాదు వెళ్ళాలి. ఉదయం 8 గంటలకు డా॥ కృపారావుగారి హాస్పిటల్‌కి వెళ్ళాము. అక్కడి నర్సులు ఇద్దరు నా దగ్గరకి వచ్చి 'ఇంత కడుపు అయ్యేదాకా వుండి, ఇప్పుడు చావటానికి మా ఆస్పత్రికి

వచ్చావా' అని కోపంగా అన్నారు. 'అదికాదు కృపారావు నా స్నేహితుడు. ఆయనను చూడటానికి వచ్చాను' అన్నాను. అందుకు వారు 'ఆయన ఆ చివరి గదిలో వుంటారు, ఆయన చాలాకాలంగా పేషెంట్స్‌ని చూడటంలేదు, ఆయన కుమారుడు కేశవబాబు చూస్తున్నారు' అని చెప్పారు. నేనింత వరకు కేశవబాబును చూడలేదు. ఆయన గదిలోకి వెళ్ళి 'నేను మీ తండ్రిగారి స్నేహితుడను, ట్రీట్మెంట్ కోసం రాలేదు, నా పరిస్థితి ఎలా వుందో తెలుసుకుందామని వచ్చాను' అని చెప్పాను.

అందుకు ఆయన 'మీరు లోపలికి వచ్చేటప్పుడే చూశాను, మీరు రెండురోజుల కంటే ఎక్కువకాలం బ్రతకరు' అని 'అయినా మీరు హైదరాబాద్ వెళ్ళాలనుకుంటే డా॥ నాగేశ్వరరెడ్డిగారి వద్దకు వెళ్ళి ప్రయత్నించి చూడండి. పంజాగుట్టలో మెడినోవా వ్యాధి నిర్ధారణ కేంద్రం అది అన్నాడు. 'సరే, రిఫర్ చేయండి, హైదరాబాద్ వెళ్ళాలను కుంటున్నాం' అని చెప్పాను. 'ముందు మీ రైల్వే రిజర్వేషన్ టిక్కెట్టు చూపండి అప్పుడు వ్రాసి ఇస్తాను' అన్నాడు. రైల్వేస్టేషన్ ప్రక్కనే వుండటం వలన అరగంటలో రిజర్వేషన్ చేయించాం. డా॥ కేశవబాబు దగ్గర లెటర్ తీసుకొని ఆ రాత్రే హైదరాబాదు బయలుదేరాం. నేను హైదరాబాద్ రావటం అక్కడే వున్న నా వాళ్ళెవరికీ సంతోషం కలిగించలేదు. అయినా నా దగ్గర వున్న డబ్బుతోనే పరీక్షలు చేయించుకోవడంతో ఎవరినీ నేను ఎప్పుడూ డబ్బులు అడగనని తెలుకున్నారు. పంజాగుట్టలోని మెడినోవాకు ఉదయం 10-30 గంటలకు వెళ్ళాము. 950 రూపాయలు కట్టించుకొని గదిలోకి తీసుకెళ్ళి నోట్లో ఒక ఇనుపగొట్టం పెట్టి వెలుగుతున్న రెండు చిన్నబల్బులు నా కడుపులోకి దించి కంప్యూటర్‌తో ఫోటో తీశారు. తర్వాత సాయంకాలం మూడు గంటల వరకు ఎన్నెన్నో పరీక్షల కొరకు అనేకచోట్లకు తీసుకొని వెళ్ళారు.

చివరలో ఎక్కడో ఒక గదిలో కూర్చున్న డా॥ నాగేశ్వర రెడ్డిగారి వద్దకు తీసికొని వెళ్ళారు. ఆయన చేతిలో నా పరీక్షల కాగితాల కట్ట వుంది. ఆయన వాటిని చూస్తూ, నేను లోపలికి రాగానే 'ఇవన్నీ మీ పరీక్షల కాగితాలు, ఇవికాక మీరు 15 రోజుల క్రితం ఒంగోలులో స్కానింగ్ చేయించిన కాగితాలు వున్నాయి. ఒంగోలులో చేయించిన స్కానింగ్‌లో మీకు 80 శాతం జబ్బు వున్నది. అంత జబ్బుతో ఎవరూ బ్రతకరు. కాని మీరు బ్రతికే వున్నారు. మా స్కానింగ్ మిషన్లు అన్నీ విదేశాల నుండి వచ్చినవి. చాలా మంచి మిషన్లు. కాని వాటిలో తీసిన రిపోర్టులో మీ శరీరంలో ఏ జబ్బు కనిపించటం లేదు. చాలా ఆశ్చర్యంగా వుంది. అందుకే మిమ్మల్ని నాలుగు గంటల పాటు రకరకాల పరీక్షలు చేశాము. మీ తల వెంట్రుకల నుండి పాదాల వరకు రకరకాల పరీక్షలు చేసినా మీ శరీరంలో ఈ జబ్బేకాదు, ఏ రకమైన జబ్బూ లేదు. మీ కడుపు నిండా నీరు వుంది. అది ఇప్పుడు తీస్తే మళ్ళీ వస్తుంది. రెండు రకాల మాత్రలు వ్రాశాను, 21 రోజులపాటు వాడితే కడుపు మామూలు స్థితికి వస్తుంది' అన్నాడు. '21 రోజుల తర్వాత మరలా ఇక్కడికి రావాలా?' అని అడిగాను. 'నీకు అసలు ఏ జబ్బు లేనప్పుడు మరలా ఎందుకు రావడం. నువ్వు మరలా ఇక్కడికి రావలసిన అవసరం లేదు' అన్నాడు. 'పథ్యం ఏమిటి?' అని అడిగాను. 'నీ ఒంట్లో నెత్తురు లేదు. అందుకని నీకేది ఇష్టమైతే అది తిను కాని ఉప్పు తక్కువగా తీసుకో' అన్నాడు.

ఒంగోలు వచ్చిన తర్వాత డాక్టరుగారు చెప్పినట్లుగానే అన్నీ రకాలైన భోజనాలు, మాంసం, చేపలు ఎక్కువగా తినటం ప్రారంభించాను. డాక్టరుగారు చెప్పినట్లుగానే నా కడుపు సాఫీగా అయ్యింది. ఒక నెల తర్వాత చర్చిలో బుధవారం సాయంకాలం వాక్యం చెప్తూ ఎడమ చేయి మణికట్టు దగ్గర గీరితే రక్తం వచ్చింది. మరుసటి రోజు గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళి చెప్పాను. మీకు ఏ జబ్బూ లేదు, శరీరంలో రక్తం ఎక్కువ అయింది అన్నాడు డాక్టరు. ఏం చెయ్యమంటారు అని అడిగాను. రక్తదానం చెయ్యమని సలహా ఇచ్చాడు డాక్టరు. నా రక్తం పనికివస్తుందా? నాకు ఐదు నెలల క్రితం పసికర్లు అయ్యాయి అన్నాను. ఆయన నాకు రక్త పరీక్ష చేసి, మీకు అసలు ఎప్పుడూ పసికర్లు రాలేదు, నీకు బి.పి. కానీ, షుగరు కానీ లేవు అన్నాడు. వెంటనే నేను ఒక బాటిల్ రక్తం దానం చేశాను. 6 నెలల తర్వాత మరలా రక్తదానం చేశాను.

ఒక్క సామ్యేలు రాజేంద్ర చనిపోతే దేవునికేమీ కొదువ కాదు. వందమందిని ఒక్కక్షణంలో ఆయన లేపగలడు. కాని నశించిపోతున్న ఒక పాపినైన నా కొరకు ఆయన ప్రణాళికతో అమెరికా నుండి వచ్చిన జానెట్ అనే ఆమెను సాక్షిగా పెట్టి, 2000 సంవత్సరాల క్రితం (మార్కు సువార్త 1వ అధ్యాయం 29వ వచనము ప్రకారం) జరిగిన సంఘటనలోనికి నన్ను తీసుకొని వెళ్ళాల్సిన అవసరం దేవదేవునికి ఏమీ లేదు.

దేవుని ప్రేమ అనేది మానవ మాత్రులకు వివరించ అసాధ్యము. ఎవరికి వారు అనుభవములో మాత్రమే తెలుసుకొనగలిగినది.

ఆధునిక దృక్పథం

# క్రొత్త కోణాలు

## 6. ధన్యతలు - విరిగిన హృదయం-దొరికే ఆదరణ

**దుఃఖపడువారు ధన్యులు వారు ఓదార్చబడుదురు" మత్త. 5:4**
"Blessed are they that mourn: for they shall be comforted"_ KJV
**ఇప్పుడు ఏడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు" లూకా 6:21.**
**కొని తెచ్చుకొన్న కష్టాలతో, కాలదన్నుకొన్న అవకాశాలలో, కొట్లాటల్లో కుమిలి కుమిలి ఏడుస్తూ, కన్నీరు కుండపోతగా యేడ్చేవారు ధన్యులా? వారిని ఆదరించి ఓదార్చే వాగ్దానం క్రీస్తు తన రాజ్యంలో ఇస్తానని వాగ్దానం చేస్తున్నాడా? ఈ క్రొత్తకోణాల్లో పరిశీలిద్దాం.**

దుఃఖపడటం, ఏడ్పు, రోదన, అంగలార్పు... ఏ కోణంలో చూచినా ధన్యత అనిపించుకోదు. ఇవన్నీ సంతోషానికి వ్యతిరేకం. అబ్రాహాము శారా మృతి పొందగా ఆమె నిమిత్తం అంగలార్చటానికి, ఏడ్వటానికి పోయాడు (ఆది. 23:2); యెహోవా విసర్జించిన సౌలుకోసం సమూయేలు ఎంతో కాలం దుఃఖించాడు (1సమూ. 16:1); స్నేహితులు యోబుకు కలిగిన అవస్థను విని ఆతనితో దుఃఖించారు, ఓదార్చారు. (యోబు 2:11). ఆ ఓదార్పు యోబుకు సంకటంగా మారిందనుకోండి! యోసేపు చనిపోయాడని విని యాకోబు అంగలార్చాడు (ఆది. 37:34). సమయంలో తన కుమారులు అతణ్ణి ఓదార్చారని ఉంది. ఎంత కుత్సితం. తండ్రి దుఃఖానికి కారకులే ఓదార్చటమా! దావీదు తన కుమారుని కోసం అంగలార్చాడు (2సమూ. 13:37) ఆ కుమారుడెంత అధ్వాన్నపు పనిచేసిన వాడైనా. యేసు తాను ప్రేమించిన లాజరు మరణించినట్లు విని కన్నీరు విడిచాడు (యోహా. 11:35).

అక్కడ (నరకంలో) పండ్లు కొరుకుట, ఏడ్పు ఉంటాయి (మత్త. 13:4). ఇలాంటివన్ని తీరని వ్యధ, దుఃఖం చూపేవి. ఇవన్నీ ఎలా ధన్యతలౌతాయి?

ఇటీవల (జూన్,1999లో) నా తుంటి ఎముక బంతి చిట్లి ఒక పెద్ద ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. మూలిగే నక్కపై తాటికాయ అన్నట్లు దానికి ముందు గుండె బైపాస్ ఆపరేషన్ చేశారు. దేవుని కృపవలన నెలాఖరుకు ఇల్లుచేరాను. ఎంతోమంది సహృదయులు పలుకరించి పోయారు. ఒక కడు వృద్ధురాలు చూడవచ్చింది. వలవల ఏడ్చింది. ఆమె ఎందుకు ఏడ్చిందో నాకు తెలియదు. నేనే ఆమెను ఓదార్చవలసి వచ్చింది. ఇందులో ఎవరికి ధన్యతో తెలియటం లేదు.

కనుక, కష్టాల్లో, నష్టాల్లో, బాధల్లో, కొన్నిసార్లు సుఖాల్లో సహితం దుఃఖం కలుగుతుంది. అందుకు, ఎలానైతేనేం ఎవరో ఒకరు ఓదార్చేవారు ఉంటూనే ఉంటుంటారు.

అసలు యూదులు మెస్సీయా కోసం ఎదురు చూడటంలో 'యెహోవా ప్రతివాని ముఖము చూచి బాష్ప బిందువులను తుడిచివేయును' అని ఉంది. ప్రక. 7:9–17ప్రకారం వెయ్యేండ్ల ముందట పునరుత్థానులగు పరిశుద్ధుల విషయం చెప్పబడితే 'ప్రతివాని' అనేమాటనుబట్టి ప్రతిఒక్కరూ ఏడిస్తే చాలు ఓదార్పు పొందు తారనే భావనకు దారితీస్తుంది. యేసుక్రీస్తు ఉద్దేశం ఇలాంటి పైపై అర్థాల్లో చెప్పబడలేదని మనం గ్రహించవచ్చును.

### దుఃఖించుట

ఈ వచనములో ఉపయోగించిన 'దుఃఖపడు' అను మాటకు ఉపయోగింపబడిన గ్రీకు మాట 'పెన్థియో' (pentheo) సాధారణమైన దుఃఖపడుటకుపయోగించు మాటకాదు. ఒక సన్నిహితుని మరణ కారణంగా దుఃఖించుటను సూచించునది.'ఆయనతో ఉండినవారు దుఃఖపడి యేడ్చుచుండగా (మార్కు 16:10–11), 1కొరిం. 5:2; యాకో. 4:9లలో కూడ ఉపయోగింపబడినది. ఈ విషయం ముమ్మందు వివరింపబడుతుంది. గ్రీకులో, లోలోపల కలుగు సాధారణ దిగులుకు లూపియో (2కొరిం. 2:2:5;7:8,9; ఎఫె. 4:30) అనిన్నీ ఇంకా సామాన్యమైన దుఃఖమునకు 'ల్యూపియోమాయ్' అను మాట గలదు (మత్త. 14:9; 17:23; 26:37; రోమా 14:15).

### మూడు విధములైన వివరణ

ఈ వచనమును మూడు విధములైన 'దుఃఖపడుట' తోను, ఒక్కొక్క సందర్భములో వాస్తవముంది.

**1**

మాటకుమాటగా దుఃఖపడటం: జీవితంలో సుఖ

దుఃఖాలు కావటికుండలు. ఎన్నో చేదు అనుభవాలవల్ల ఎంతో మనఃక్లేశం కల్గుతుంది. దీన్ని భరించటం, సహించటం ఒక ధన్యతే. ఎండ శుభమయిందే, కాని, ఎండ కాచి ఎడారైంది అని ఒక నానుడుంది. అలా బీడువారిన భూముల్లో గడ్డిపోచ కూడ మొలవదు పండ్లు, ఫలాలు మాట అటుంచి! వాన చిలకరింపులే పంటకాపుకు మూలం. ఎండ తీక్షణతే వాన కురిపిస్తుంది కూడ. అలానే అధిక దుఃఖంవల్ల కన్నీటి జల్లు లొస్తాయి. అవే ఓదార్పు ఫలాలు పండిస్తాయి.

ఇలాంటి దుఃఖం రెండు విధాలుగా ఫలితమియ్యొచ్చు. మన దుఃఖంవల్ల ఎదుటి మానవుల సానుభూతిని చవి చూడొచ్చు. ఆపై అంతస్థులో దేవుని కృపాకనికరాన్ని చవి చూడొచ్చు. ఆ వరుసకొస్తే ఎంతో మంది తమ దుఃఖార్తిలోనే తోడి మానవునిలో, దేవునిలోగల ఔన్నత్యాన్ని కనుగోగలిగారు. జీవితం నల్లేరు మీద నడకలా సాఫీగా జరిగేటప్పుడీ హృదయ సౌందర్యాలు బయటపడవు. పైపై మెరుగులే మిరుమిట్లు కొలుపుతాయి. దుఃఖంలో జీవితంలోని లోతు పాతుల్ని అందుండే అగాధ ఆణిముత్యాల సరుల్ని కనుగొంటాం. వానితో ఆత్మీయ స్థైర్యాన్ని, సౌందర్యాన్ని సంతరించుకుంటాము. సుఖసుందరితో నడిచానొక మైలు దూరం దోవంతా వాగుతూ వలకపోసింది వయ్యారం చెప్పిందంతా అయింది వట్టి మాటల బండారం మెదడుకైతే అంటలేదు కించెత్తు సింగారం!

దుఃఖకాంతతో నడిచానదే మైలుదూరం పల్లెత్తి మాటైనా అనకుండానే జరిగింది సంచారం ఓయబ్బో అనుపించింది దానిమాటే బంగారం అయితేనేం, ఆ మూగ చెంత నేర్చానెంతో జీవితసారం!

## 2

మన విషయమెలా ఉన్నా, కొందరు లోకంలో, లోక వాసుల్లో ఉండే శ్రమల్ని, దుఃఖాన్ని చూచి దుఃఖపడతారు. మొదటి ధన్యతను చూచినప్పుడు లోకానికి, అందలి సమస్త వ్యామోహాలకు దూరంగా ఉండాలని చూచాం. అలా అని సంఘ పరిత్యాగులమటం (సన్యసించటం) క్రైస్తవ బోధకాదు. సంఘంలోని కుళ్ళు, కడుగుతో తాదాత్మ్యం చెంది దానికోసం పరితపించటంలో ధన్యత ఉంది. ఎదుటి వారి దుస్థితికి దుఃఖించి, ద్రవించిన వారే లోక కళ్యాణానికి దోహదకారులయ్యారు. పేదరికాన్ని నిర్మూలించారు; బానిసత్వాన్ని పారద్రోలారు. మనుష్యుల్లో మానవత నుండి దిగజారి, (dehumanised) అణగారి అర్రులు చాచే వారికి ఆదరణ కలుగజేసిన మానవాగ్రగణ్యులెందరో భూమి మీద తమ అడుగుజాడలను ముద్రించారు. విరాళాలిచ్చారు. ఆశ్రమాలు కట్టించారు. ఉద్యమాలు నడిపారు. ప్రాణత్యాగాలు కూడ చేశారు. హతసాక్షు లయ్యారు. వేయేల, మానవ జీవితంలోని దేవుడైన యేసును సహితం ఈ దుఃఖమే అనేక అద్భుతాలు చేయించింది. ఇతరుల దుఃఖానికి తీవ్రంగా స్పందించని వారే లేకుంటే ఈ లోకం ఇంకా దౌర్భాగ్యమయ్యేది.

క్రైస్తవ్యమంటేనే ఇతరులను గురించిన శ్రద్ధ. ఈ కోవలో ఎదుటి (పొరుగు) వాని దుఃఖానికి దుఃఖించటం ఎంత ధన్యత! వారు ఇతరుల పరామర్శలో ఓదార్పు తప్పక పొందుతారు!

## 3

అయితే, పరలోకరాజ్య ప్రణాళికా ప్రకటన సంధర్భంలో చెప్పిన ఈ సూత్రం, ప్రధానంగా, తన స్వంత పాపభారం నిమిత్తం, తన స్వంత దిక్కుమాలిన స్థితిని గురించి నిస్సహాయంగా దుఃఖపడే వారి ధన్యతను గురించి చెప్పబడింది. అందుకే, ఈ దుఃఖం అపారమయింది. యోసేపు మరణించాడని విని యాకోబు పొందిన వేదన, గుడ్డలు చింపుకొని గోనెపట్టలు ధరించి విలపించేంత దుఃఖం. 'రాత్రింబగళ్ళు నా కన్నీళ్ళు నాకు అన్నపానములాయెను' అని కోరహు కుమారులు రచించిన కీర్తనలోవలె (కీర్త. 42:3).

యేసుప్రభువు సువార్తలో మొట్టమొదటి మాట 'మారుమనస్సు పొందుడి' అని. ఏ మానవుడు కూడ తన స్వంత పాపాల కోసంగా పరితపించకుండ పశ్చాత్తాపపడలేదు. యాకోబు పత్రికలో 'వ్యాకులపడుడి; దుఃఖపడుడి, యేడువుడి, మీ నవ్వు దుఃఖమునకును మీ ఆనందము చింతకును మార్చుకొనుడి' (4:9) అన్నట్లు. ఈ దుఃఖము కేవలం దుఃఖంకోసం కాదు; మారుమనస్సు కోసం అని పౌలు చెప్పింది గమనార్హం. లోక సంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును' (వ. 10), అయితే, పశ్చాత్తాప దుఃఖము నిత్యజీవం కలుగ జేస్తుంది.

అట్టి దుఃఖాన్ని పుట్టించ కలిగింది క్రీస్తు సిలువ ఒక్కటే. ఆ సిలువను చూచినప్పుడు కాని పాపం మనకేం చేయగలదో అర్థమౌతుంది. పరిపూర్ణ సౌందర్యవదనుడైన యేసును స్వరూపం లేకుండా చితుకగొట్టింది. పాపం సృష్టించే భీభత్సాన్ని అవగాహన చేసుకొంటేగాని మనలో దుఃఖం

రాదు. అందుకే, తన స్వంత పాపాలకోసం దుఃఖపడేవారు ధన్యులౌతారు. వారికి రక్షణ. అదే ఓదార్పు. ఆదరణ. విరిగిన హృదయం – దొరికే ఆదరణ.

విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు విరిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు. కీర్తనలు 51:17.

**వచ్చే మాసం:**
**సాత్వీకం - భూస్వాస్థ్యం**

## చందాదారుల వివరములు

రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
డా॥ సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
జయ, గుంటూరు (6-3-24)- 1500/-
గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
జి.మాణిక్యమ్మ అనంతపురం (25-3-24) 1000/-
కె. రజిని, నరసరావుపేట - 1000/-
వి. కస్తూరి, భీమవరం 500/-
శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
నైటింగేల్, నెల్లూరు - 500/-
మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
ఆర్. దేవికుమారి, పర్చూరు (20-5-24) 500/-
వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
జి. కళావతి, ఒంగోలు 350/-
కె. కల్పన, గోవా - 350/-
జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
సి. హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట (18-3-24) 350/-
కె. రాజేష్, రాజమండ్రి - 350/-
యస్. గోపి, పార్వతీపురం - 350/-
పి. దేవదానం, గుంటూరు - 300/-
పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-
టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-
టి.యం. భగవాన్‌దాస్, కదిరి (7-3-24) - 350/-
కె. విజయకుమార్, ఒంగోలు (1-3-24) 350/-

## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్ధ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

ఆయన ఒంగోలు ఎ.బి.యం.లో హైస్కూలు చదువు వరకే చదివారు. 1942 నుండి ఇండియన్ ఆర్మీలో బొంబాయి దేవలాలి కంటోన్మెంటులో స్టోరు ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించినందున నాటి ఆఫీసర్సు అందరు ఇంగ్లాండు వారే అయినందున ఇంగ్లీషు బాగా సాధన మయింది. అందువలన సేవార్థమై అమెరికాలోని లాస్ ఏంజల్స్‌లో సంఘం ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్ళాల్సి వచ్చినప్పుడు, భాష గురించి ఇబ్బంది లేదు. చదువుకున్న వారైనా, చదువుకోని వారైనా, ఎటువంటి తెల్లవాళ్ళతోనైనా వారికి అర్థం అయ్యేరీతిలో ఇంగ్లీషు మాట్లాడేవారు. అందు వలన అమెరికా దేశమునకు ఆరుసార్లు ఆహ్వానించబడ్డారు.

నాటి పెద్ద క్రైస్తవ సంస్థలైన వరల్డ్ విజన్ స్థాపకుడు రెవ. పాల్‌రీస్, టీమ్ మిషన్ స్థాపకుడు బాబ్‌బ్లాండ్, కాసా చిన్నపిల్లల సంస్థను భారతదేశానికి తీసుకొనివచ్చి భారతీ యులకు ఎంతో మేలు చేశాడు. తరువాత రోజుల్లో ఆ సంస్థ బ్రాంచీలు భారత్‌లో విస్తరించినను కృపాదానంగారికి అమెరికాలోని హెడ్‌క్వార్టర్స్‌తోనే నేరుగా సంబంధాలుండేవి.

ఇప్పుడు కోట్లు ఖర్చు చేసి క్రైస్తవ ఆలయాలు నిర్మిస్తున్న వారు, యేసు కూర్చున్న స్థలంలో ఎదురుగా ఉండి అటు ఇటు తిరుగుతూ భోజనం తయారు చేస్తూ, యేసు పాదముల వద్ద కూర్చుంటే యేసుప్రభువుకు ఆయన వెంట వున్నవారు దాదాపు 20 మందికి ఎవరు భోజనము సిద్ధము చేస్తారు? అనుకుంటున్న లూకా సువార్తలోని మార్తవలె ఉన్నారు.

ఈ జీవితంలో ఎంతటివాడైనా క్రైస్తవ మతం కొరకు పనిచేస్తే యేసు పాదములకు దూరం అవుతాడు. మార్త యేసు పాదములకు దూరమైంది. అవసరమైనది ఒక్కటే యేసుతో సహవాసము.

ఆత్మల రక్షణ కొరకు సాధనముగా కృపాదానముగారిని దేవుడు సేవకు పిలిచాడు. ఆత్మలను సంపాదించటం కోసము ప్రభువు వాక్యము వినటమే మన పని. మరియ యేసును సంపాదించుకున్నది. సేవ అంటే యేసే క్రీస్తు అని చెప్పడం. అంతే కాని ఆదివారం ఆర్భాటంగా పాటలు పాడటం కాదు...

ప్రతి గ్రామములోను ఒక చిన్న చర్చిని కట్టాలని తీర్మానం చేసుకున్నాడు కృపాదానం. కట్టాడు కూడా. అయితే అందుకు కావలసిన ధనము కొరకు యేసు వైపు కాక పోస్టల్ డిపార్టుమెంటు వారి ఎయిర్ మెయిల్ ఉత్తరాల వైపు చూచినాడు.

ఆ రోజుల్లో సువార్తికులు ఒకరికొకరు ఎదురైనపుడు (చదువుకున్న వారు, చదువులేనివారు, ఏ వయస్సు వారైనా) మెయిన్ పోస్టాఫీసులో ఉదయం 9, 10 మధ్యలో కలుసు కుంటే పలకరించుకునే మాట ఈరోజు డాలరు ఎంత పలుకు తుంది? అని. హైదరాబాద్, చెన్నైలలో జరిగే సువార్తికుల కాన్ఫరెన్స్‌లలో కలుసుకొంటే ఎఫ్.సి. ఉన్నదా? వీసా ఉన్నదా? అని అడిగేవారు. మరికొందరు తక్కువ చదువు కున్న సువార్తికులు అమెరికాకు బాగా ఉత్తరం వ్రాయగల నైపుణ్యమున్నవారు ఎవరు? అని అడిగేవారు.

అదే స్థితిలో కృపాదానంగారు ప్రవేశించారు. ఇందిరమ్మ పరిపాలనలో రూపాయి విలువ తొందరగా పడిపోయేది. డాలరు విలువ పెరిగినది. దాంతో రాబడి పెరిగింది.

ఆత్మల కొరకు కాదు ఆత్మలు సంపాదించడానికి కాదు. చిన్న కారు కొరకు ప్రార్థించండి. మొదట్లో సెకెండు హ్యాండ్ తర్వాత రోజుల్లో క్రొత్తకారు.

సువార్తికునిగా యేసు బిడ్డగా జీవించనారంభించి, సేవచేయటానికి విరోధి అయిన సిరి ప్రక్కకు నెట్టబడ్డాడు. లాల్చీ పైజామాతో సువార్తికునిగా ప్రారంభించి సూటు లేకుండా సేవ లేదు అన్నాడు.

"దేవుడు మీ హృదయమును ఎరుగును. మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము" ఇది యేసు చెప్పిన మాట.

అది నీవు ధరించిన సూటైనా నీవు ప్రయాణించే కారయినా నీవు నివశించే ఇల్లయినా నీవు ప్రార్ధించే చర్చి అయినా లోకం దృష్టిలో ఘనమైనదైతే అది దేవుని దృష్టికి అసహ్యమే!

ఒక రోజంతా ఒక్కోసారి రెండు రోజులు కుటుంబము అంతా ఆహారం లేకుండినా దేవుని సన్నిధిలో సంతోషంగా సమాధానంగా ఉండేది. ఎప్పుడైతే జనులకు ఘనమైనది గాను దేవుని దృష్టికి అసహ్యమైనదిగా ఉండే ఇంటిలోను, సేవలోను కృపాదానంగారి కుటుంబము ప్రవేశించినదో ఆ తర్వాత సమాధానం సంతోషం అంతరంగంలో నుండి మాయమైనవి. పైకి లోకానికి అబ్బురముగా అనిపించేవి.

బ్రదర్ భక్తసింగ్‌గారు హైదరాబాద్ హెబ్రోనులోని మందిరాన్ని మనుష్యులలో ఘనముగా ఎంచబడునట్లు ఎందుకు నిర్మించలేదు? ఎల్లప్పుడు తెల్లని దుస్తులు ఎందుకు ధరించారు? ఘనమైన సూట్సు ధరించి లక్షల ఖరీదైన కార్లు ఎందుకు వాడలేదు? అంటే ఆయన దేవుని ప్రేమించినట్లు ఈ లోకమును ప్రేమించలేదు కనుకనే అని చెప్పాలి.

కృపాదానం, హన్నమ్మలు 24 సంవత్సరముల కాల పరిమితిలో 12 మంది సంతానమును ప్రభువు కొరకు కన్నారు. 1961లో మచిలిపట్నంలో ఒక మిషనరీ కృపాదానంతో మాట్లాడుతూ నీకు 12 మంది సంతానం కాకుండా ఆరుగురు పిల్లలయితే నీకు తేలికగాను పిల్లలకి ఆనందంగాను ఉండేది అన్నాడు. నిజమే మీరు చెప్పింది కాని ప్రభువుకు దుఃఖముగా ఉండేది అన్నాడు కృపాదానం.

ఏం? అన్నాడు దొర.

దేవుడు మానవులకు ఇచ్చిన మొదటి ఆజ్ఞ – మీరు ఫలిస్తూ సంఖ్యలో అధికం కండి. భూలోకమంతటా విస్తరించండి దానిని లోబరుచుకోండి మనం అలా చెయ్యకుండా ఉంటే అది ఆజ్ఞాతిక్రమమే కదా అన్నాడు.

కొద్దిమంది అయితే పిల్లలు బలంగా ఆరోగ్యంగా ఉంటారు అన్నాడు దొర. నాకు 12 మంది పిల్లలు బలంగా ఆరోగ్యంగా ఉన్నారు. ఇది దేవుని దీవెనయే. జాన్‌వెస్లి మెథడిస్టు స్థాపకుడు తల్లిదండ్రులకు 15వ సంతానము. అతని తల్లిదండ్రులు కుటుంబ నియంత్రణ చేస్తే ఒక దేవుని సేవకున్ని మనం పోగొట్టుకొనేవారము. కుటుంబ నియంత్రణ పాపం అంటాను అన్నాడు. ఆ మాట ఆ రోజు కార్యక్రమములో గొప్ప అలజడి పుట్టించింది.

(సశేషం)

## ప్రథమ జ్ఞాపకార్థ కూడిక



**క్రైస్తవ నవలా రచయిత, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక వ్యవస్థాపకులు**

**కీ॥శే॥ కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి**

**ప్రథమ జ్ఞాపకార్థ కూడిక తేది 03-07-2024 బుధవారం ఉదయం 10-00 గంటలకు ఒంగోలు, క్లౌపేట, 6వ లైనులోని ప్రభువు సంఘమునందు జరుగును. కావున హన్నాకృప పాఠకులు, ఆప్తులు, మిత్రులు, అభిమానులు తప్పక పాల్గొనవలసినదిగా ఆహ్వానించుచున్నాము.**

**జననం: 17-08-1940**
**మరణం: 03-07-2023**

**ఇట్లు**
**కుటుంబ సభ్యులు**

స్త్రీల విభాగం

# అన్న

దేవుని మహాపరిశుద్ధ నామంలో పాఠకులందరికి వందనములు. బైబిల్లోని స్త్రీలలో ప్రవక్తియైన అన్న గురించి ఈ సంచికలో ధ్యానిద్దాం.

అన్న గురించి కేవలం లూకా సూవార్తలోనే చెప్పబడినది. అది కూడా కేవలం మూడు వచనాలే. లూకా 2:36-38. అన్న అనే పేరు లింగబేధం లేకుండా స్త్రీ, పురుషులు ఇద్దరికి వాడబడడం ఆ పేరుకున్న ప్రత్యేకత. అయితే కేవలం ఆమె పేరుకే కాక ఆమెకు కూడ కొంత ప్రత్యేకత ఉన్నది. అందుకే ఆమె పరిశుద్ధ గ్రంథములో స్థానం సంపాదించింది. అన్నను ప్రత్యేక పరచిన ఆమె గుణ లక్షణాలను ధ్యానిద్దాం.

**భయభక్తులు గలిగిన జీవితం:** అన్న వివాహానికి ముందు ఆమె జీవితం గురించి ఏమియు తెలుపబడలేదు కేవలం ఆమె ఆషేరు గోత్రానికి చెందినది. ఆమె తండ్రి పేరు పనూయేలు. ఆమె ఒక ప్రవక్త్రి అని వ్రాయబడింది. బహుశా ఆమె వివాహానికి ముందే ప్రవచించే వరము కలిగి ఉండ వచ్చు. వివాహానికి ముందే ఆమె ప్రవక్త్రి అనునది నిజమైతే అన్న యొక్క బాల్యము యవ్వనము దేవునియందు భయ భక్తులతో గడిచినది అని చెప్పవచ్చు. ఎందుకంటే రాబోవు వాటిని, జరగబోవు సంగతులను ముందుగా చెప్పేవారిని ప్రవక్త/ ప్రవక్త్రి అని అంటాం. దేవునితో అనుదిన వ్యక్తిగత సహవాసము లేకుండా భవిష్యత్ విషయాలను గురించి ప్రవచించుట అసాధ్యము. కాబట్టి అన్న చిన్నతనము నుండి దేవునియందు భయభక్తులు కలిగినది అనుటకు కొంత సంభావ్యత ఉన్నది. లేదా వివాహానంతరం ఆమె నిత్యము, దేవాలయము విడువక చేసిన సేవ, దేవునియందలి భయభక్తులు ఆమెను ప్రవక్త్రి స్థాయికి తీసుకెళ్ళాయి అనవచ్చు.

దేవున్ని ఎరిగిన మన భక్తి జీవితం ఎలా ఉన్నది? ప్రవచించే వరముతో సంబంధము లేకుండా మన వ్యక్తిగత జీవితం దేవుని ఎదుట నిష్కళంకముగా ఉన్నదా లేదా అని భయము కలిగి అనునిత్యం పరీక్షించుకొనుచు, భక్తితో సరిచేసుకొనుచు దేవుని ఎదుట భయభక్తులు కలిగి జీవించ వలసినవారమై ఉన్నాము. అది క్రైస్తవ స్త్రీలకు ఉండవలసిన లక్షణం.

అన్న భక్తి జీవితం తన వరకే కాక తన తండ్రికి, గోత్రానికి కూడ బైబిల్లో స్థానం సంపాదించుటకు కారణ మైంది.నీ భయభక్తులు కల్గిన జీవితం నీ తండ్రికి, నీ పుట్టింటి వారికి, మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెడుతుంది.

"యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడ బడును" సామెతలు 31:30

**దేవునిపై ఆధారపడుట:** ఏడు సంవత్సరముల వైవాహిక జీవితం అనంతరం అన్న వైధవ్యం అనుభవించవలసి వచ్చింది. మంచి యవ్వన వయస్సులో విధవరాలైంది. ఆ కాలం నాటి పరిస్థితులను బట్టి ఆలోచిస్తే విధవరాలైనప్పుడు అన్న వయస్సు 25 సంవత్సరముల లోపే అయిఉంటుంది. ఎవరైనా వివాహం చేసుకునేది ఎందుకు? ఈ లోకంలో జీవించినంత కాలం తోడు ఉంటారని. కానీ అన్నకు చిన్న వయస్సులోనే తన తోడు దూరమైంది. ఎవరిని ఆధారము చేసుకొని తన భవిష్యత్తు ఊహించుకుందో ఆ ఆధారము మరణించడంతో తన కలలు, భవిష్యత్తును గూర్చిన తన ఆలోచనలు, ప్రణాళికలు అన్నీ కుప్పకూలిపోయాయి. ఒంటరిదైంది. ఎంతో కుమిలిపోయి ఉండవచ్చు, కన్నీరు కార్చి ఉండవచ్చు. అందుకే అన్న ఈ సారి పరిస్థితులకు అతీతుడును ఎన్నటికి చేయి విడువని, నమ్మదగిన దేవుని మీద ఆధారపడి జీవించుటకు నిర్ణయించుకున్నది. దేవునిపై ఆనుకున్నది. రెండవ వివాహం చేసుకొని అందరివలె సాధరణమైన జీవితాన్ని జీవించుటకు అన్నకు అవకాశము ఉన్నది. రెండవ వివాహానికి సంబంధించి సలహాలు సూచన లు, ప్రతిపాదనలు ఆమెకు అంది ఉండవచ్చు. కానీ అన్న లోకానుసారముగా ఆలోచించక, తన భవిష్యత్తు గురించి చింతించక, సామాజిక పరిస్థితలకు భిన్నంగా, తన ఆప్తుల ఆలోచనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకొనుట ధైర్యంతో

కూడిన విషయం. అంత ధైర్యాన్ని ప్రదర్శించడానికి కారణం ఆమె నిర్ణయానికి ఆధారమైన దేవుడు. దేవునిపై ఆధారపడిన వారు మాత్రమే సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోగలరు.

నీవు ఎవరి మీద ఆధారపడి జీవిస్తున్నావు? కష్టంలో ఇబ్బందిలో ప్రతి క్రైస్తవురాలు దేవునికి ప్రార్థిస్తుంది. అయితే అది దేవుని మీద ఆధారపడటం కాదు. సమాజ పోకడకు భిన్నంగా, దేవుని కొరకు లోకానికి ఎదురీదే పరిస్థితిని స్వాగతించగలగడం దేవుని మీద ఆధారపడి జీవించడం.

**మంచి సాక్ష్యము కల్గియుండుట:** అన్న కేవలం నిర్ణయం తీసుకోవడం మాత్రమే కాదు తను వృద్ధురాలైనంత వరకు ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంది. అందరివలె సుఖవంతమైన జీవితము కాక ఒంటరిగా కష్టపడి జీవించింది. ఆర్థికపర మైన సమస్యలు, ఆరోగ్య సమస్యలు, నిత్యావసరాల కొరకు కొంత శారీరిక శ్రమ అన్న ఎదుర్కొని ఉండవచ్చు. ఆమెకు ఎన్నో శోధనలు వచ్చి ఉండవచ్చు. వాటన్నిటిని అన్న ఉప వాస ప్రార్థనలతో జయించింది. ఉపవాసం అంటే శరీరాన్ని నలుగగొట్టుకొనుటలో ఒక భాగం. శరీరమును తృణీకరించు కుంటూ, ప్రార్థనతో దేవునికి సమీపంగా జీవించుటే ఉ పవాసప్రార్థన. "ఎనుబది నాలుగు సంవత్సరాలు విధవరాలై ఉండి దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనలతో రేయిం బగళ్ళు సేవ చేయుచుండెను" అన్ని సంవత్సరములు దేవునికి నమ్మకముగా జీవించుచు, జనుల యెదుట, దేవుని ఎదుట తన సాక్ష్యమును కాపాడుకున్నది.

నీకు ఉపవాస ప్రార్థన అనుభవమున్నదా? సంఘం లోను, కుటుంబములోను నీకు సాక్ష్యము ఉన్నదా? సాక్ష్యము కలిగి యుండుట, దానిని అంతము వరకు కాపాడుకొనుట క్రైస్తవ స్త్రీలు కోరదగినది.

**సహవాసము:** "ఆమె కూడ ఆ గడియలోనే లోపలికి వచ్చి, దేవుని కొనియాడి, యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయనను గూర్చి మాటలాడు చుండెను" అన్న సహవాసము తన వలె యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టుకొను వారితో ఉన్నది. అందుకే ఆమె యేసును చూచి, ఆయనను కొనియాడిన తరువాత వారితో యేసును గూర్చి మాట్లాడింది. దేవుని ఎరిగిన బిడ్డల తోనే అన్న సహవాసమున్నది. అలాగే వారితో ఏదో పిచ్చా పాటి కాకుండ దేవుని సంగతులను గూర్చి మాట్లాడింది.

మరి నీ సహవాసం ఎవరితో ఉన్నది? అందరితో స్నేహ పూర్వక సంబంధం కలిగిఉండుట మంచిదే కాని వారితో సహవాసం మిమ్మల్ని దేవునికి దూరం చేస్తుందా? ఆలోచిం చాలి. వారితో దేవుని విషయాలు కాక లోకానుసారమైన మాటలు మాట్లాడుతున్నారా? వారిని సంతోషపెట్టే క్రమంలో మీకు తెలియకుండానే దేవునికి దూరమౌతారు. "లోకముతో (లోకస్తులతో) స్నేహము దేవునితో వైరము" అని మనం గుర్తుపెట్టుకోవాలి. మన సహవాసము మనలను దేవునికి దగ్గరగా చేర్చునదై ఉండాలి. '*మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉ న్నది" 1యోహాను 1:3*

**నిరీక్షణ గలది:** ఆ కాలంలో ఉన్న యూదులు వారి ఆచార వ్యవహారాలు, స్వనీతి, కొంత మనకు బైబిల్లో కనిపిస్తుంది. కానీ అవేవి అన్నను, ఆమె నిరీక్షణను ప్రభావితం చేయలే దు. అందుకే ఆమె బాలయేసుని విమోచకుడని గుర్తించింది. దేవున్ని కొనియాడింది.

మరి నీ నిరీక్షణ ఏమిటి? నీ శ్రమలు బాధలు కష్టాలు దేవుడు చూస్తున్నాడు, తగిన సమయమందు ఆయన పూను కొని నీకు విమోచన/ విడుదల కలుగజేస్తాడను నిరీక్షణతో నీవు జీవిస్తున్నావా? దేవునియందు నిరీక్షణ కలిగిన వారు ప్రత్యేకంగా ఉంటారు. లోకశ వారిని ప్రభావితం చేయలేదు. అయువంటి జీవితం నీకున్నదా?

అన్న వలె ప్రతి క్రైస్తవురాలు లోకమునకు వేరై, దేవుని యందు భయభక్తులు, సంఘములో కుటుంబంలో మంచి సాక్ష్యము కలిగి, దేవునియందు నిరీక్షణతో జీవించాలి. అట్టి కృపను దేవుడు మనకందరికి దయచేయును గాక!

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

చిన్నపిల్లల పేజి

# అవసరత

టీనా చకచక లేచి తన పనులు ముగించుకొని సండేస్కూల్‌కి వెళ్ళుటకు సిద్ధపడుతుంది. టీనాకు క్రొత్త క్రొత్త విషయాలు నేర్చుకోవడం, క్రొత్త క్రొత్త ప్రదేశాలు చూడటం అంటే ఇష్టం. అలాగే సండేస్కూల్ అంటే కూడా ఎంతో ఇష్టం. సండేస్కూల్‌లో చెప్పే బైబిల్ కథలను, క్రొత్త క్రొత్త సంగతులను శ్రద్ధగా ఆలకించేది. ప్రతి ఆదివారం సండేస్కూల్‌లో తాను నేర్చుకున్న విషయాలను తల్లితో చెప్పేది. టీనా తల్లి నాన్సి ఒంటరి స్త్రీ. భర్త చనిపోవడంతో చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది.

చర్చికి బయలుదేరారు నాన్సి టీనాలు. దారిలో మమ్మీ మమ్మీ ఈ రోజు చర్చి అయ్యాక మనం రెస్టారెంట్‌కి వెళ్తున్నాముగా అడిగింది టీనా కాస్త అనుమానంగా. నెల రోజులకు పైగా ఏదో ఒక వంక చెప్పి దాటివేస్తున్నా టీనా మాత్రం ప్రతి ఆదివారం రెస్టారెంట్‌కి వెళ్ళడం గురించి మరచిపోక అడుగుతూనే ఉంది. ఇక తప్పించుకోవడం కష్టమే. ఈ నెలలో అనారోగ్య కారణంగా పెట్టిన సెలవుల కారణంగా జీతం కూడా పూర్తిగా రాకపోవచ్చు.... ఏం చేయాలి దేవుడా అని ఆలోచిస్తున్న నాన్సి, చెప్పు మమ్మీ చెప్పు అని తన చేతిని అదిలిస్తున్న టీనా పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది. వెళ్దాంలే ముందు చర్చికి వెళ్దాం పద అంటూ ఆటో దిగి చర్చిలోకి వెళ్ళారు ఇద్దరు.

ఆరాధన అనంతరం ఒక పెద్దావిడ నాన్సిని పలకరించింది. ఆమె నాన్సి భర్తకు దూరపు బంధువురాలు. ఆమె వెళ్తూ వెళ్తూ ఒక చిన్న కవర్ నాన్సి చేతిలో పెట్టి , తన భర్త దగ్గర తీసుకున్న రుణమును చెల్లించినట్లు చెప్పింది నాన్సికి ఆ రుణం సంగతి తెలియదు. డబ్బు అనుకోకుండ చేతికి అందడంతో భవిష్యత్తును గూర్చిన చింత దిగులు మాయమై సంతోషం కలిగింది. వాస్తవానికి అదేమి అంత పెద్ద మొత్తం కాదు కాకపోతే ఊహించని పరిణామం కావడంతో కాస్తంతం ఉత్సాహం కలిగింది నాన్సికి. ఇంతలో టీనా రానే వచ్చింది. రావడంతోనే మమ్మీ ఈ రోజు మనం రెస్టారెంట్‌కి వెళ్తున్నాముగా అడిగింది గోముగా. వెళ్తున్నాములే అంది తల్లి లేని కోపాన్ని ప్రదర్శిస్తు.

రెస్టారెంట్‌కి వెళ్ళగానే టీనా సంతోషానికి హద్దులు లేవు. స్కూల్లో తన ఫ్రెండ్స్ ద్వారా విని తాను ఊహించుకున్న రెస్టారెంట్ కంటే ఎంతో బాగుంది ఇది అనుకుంది టీనా మనస్సులో. దేవుడు తనకు చేసిన సహాయానికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకుంది నాన్సి తన కూతురి కళ్ళలోని సంతోషాన్ని చూస్తు.

ఇష్టంగా ఆర్డర్ చేసిన వంటకాన్ని ప్లేట్‌లో పెట్టుకొని తినకుండా కిటికీ వంక చూస్తున్న టీనా వైపు ఆశ్చర్యంగా చూసింది తల్లి. ఏంటి టీనా? ఏమైంది? తినకుండా ఏమి చూస్తున్నావు అని అడిగింది తల్లి టీనా చూస్తున్న కిటికీ వంక చూస్తూ. ఆ రెస్టారెంట్‌కి వెనుకవైపు ఒక ముసలివాడు చాలా దీనంగా కూర్చుని ఉన్నాడు. చాలా రోజులుగా తిన్నట్లు లేదు పైగా అప్పుడే మొదలైన వర్షానికి తడుస్తున్నాడు. ఇది గమనించినా టీనా మనసులో సండేస్కూల్‌లో విన్న మంచి సమరయుడు కథ గుర్తుకొచ్చింది. వెంటనే మమ్మీ, మమ్మీ నేను నా ప్లేట్‌లోని ఫుడ్ ఆ తాతకి ఇవ్వొచ్చా అని అడిగింది. ముందు సంతోషంగా ఒప్పుకొనినప్పటికి, మరొక ఫుడ్ ఐటమ్ ఆర్డర్ ఇవ్వడానికి తన దగ్గర డబ్బులు లేవని చెప్పింది తల్లి. అనుమతి ఇవ్వడమే ఆలస్యం, తన ప్లేట్ పట్టుకొని తాత వద్దకు పరుగెత్తింది టీనా. సంతోషంగా తిరిగి వచ్చిన టీనా మరేమి అడగలేదు. టీనా ప్రవర్తన తల్లికి ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ఎంతో ఇష్టపడి రెస్టారెంట్‌కి వచ్చి ఏమి తినకుండా వెళ్తుంటే నీకు బాధగా లేదా? అడిగింది తల్లి టీనాని. లేదు మమ్మీ, అవసరతలో ఉన్నవారిని ఆదుకోవాలని మా సండే స్కూల్లో చెప్పారు. అయినా మరొకసారి రెస్టారెంట్‌కి వెళ్ళొచ్చు కదా అంది టీనా కొంటెగా. తల్లి టీనాను దగ్గరకు తీసుకొని

ఈ రోజు నువ్వు చేసిన పనికి నాకు చాలా గర్వంగా ఉంది. దేవుడు నాకు ఆ స్థితి ఇస్తే ఖచ్చితంగా తీసుకెళ్తాను అంది నవ్వుతూ.

మరునాడు టీనా పేరు మీద ఒక ఉత్తరం అందింది. అందులో 5,00,000 రూపాయల చెక్‌తో పాటు అతి ఖరీదైన రెస్టారెంట్‌లో టేబుల్ రిజర్వేషన్ వోచర్స్ ఉన్నాయి. అవి ఎవరు పంపించారా అని చూస్తే అడ్రస్ లేదు. ఇంతలో టీనా వచ్చి వోచర్స్ వెనుక ఉన్న తాత ఫోటోను చూసి గుర్తుపట్టింది.

టీనా దేవునిబట్టి ఒక ప్లేట్ భోజనంతో తాత అవసరతను తీరిస్తే, దేవుడు ఈ రోజు టీనా భవిష్యత్తు మొత్తానికి కావలసిన ఆర్థిక అవసరతను తీర్చివేశాడు అని అనుకోగానే కృతజ్ఞతతో నాన్సి కళ్ళ వెంట నీళ్ళు కారాయి.

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.



## సండేస్కూల్ మెటీరియల్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| ఆత్మఫలము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బైబిల్‌బాలలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ధన్యతలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 60/- |
| సండేస్కూల్ డైరి | రూ. 75/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. 40/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 60/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 450/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**
ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-07



## సంఖ్యా. 34-36 ద్వితీయో. 1-22

1. ఎఫ్రాయిమీయుల గోత్రప్రధాని ఎవరు? (సంఖ్యా34)
2 ఒకడు ఆశ్రయపురమునకు పారిపోయిన తర్వాత ఎంతకాలము అక్కడ నివసింపవలెను?(35)
3. సెలోపెహాదు కుమార్తెల పేర్లు ఏమిటి?(36)
4. ఇశ్రాయేలీయులు బహు దినములు ఎక్కడ నివసించిరి? (ద్వితీయో. 1)
5. లోతు సంతానమునకు స్వాస్థ్యముగా ఏ ప్రదేశము ఇచ్చిరి? (2)
6. బాషాను రాజైన ఓగు మంచం కొలతలు ఏమిటి?(3)
7. చంపిన వాడు పారిపోవుటకు యొర్దానుకు ఇవతల ఎన్ని పురములను మోషే ఏర్పాటు చేసెను? (4)
8. 6వ ఆజ్ఞ ఏమిటి? (5)
9. ఇశ్రాయేలీయులు యెహోవాను ఎక్కడ శోధించిరి?(6)
10. తన ఆజ్ఞలను అనుసరించి నడుచుకొని వారికి ఎన్ని తరముల వరకు యెహోవా తన నిబంధన స్థిరపరచును? (7)
11. దేవుడు మనకు ఆకలిని ఎందుకు కలుగజేసెను?(8)
12. రాతి పలకలపై పది ఆజ్ఞలను ఎవరు వ్రాసెను? (9)
13. అహరోను ఎక్కడ చనిపోయి పాతిపెట్టబడెను? (10)
14. ఇశ్రాయేలీయులు శాపవచనములను ఏ కొండ మీద ప్రకటించవలెను? (11)
15. మనుష్యులు ఏమి తినకూడదు? (12)
16. ఇతర దేవతలను పూజించుటకు రమ్మని రహస్యముగా ప్రేరేపించిన వారికి విధించవలసిన శిక్ష ఏమిటి?(13)
17. ఎన్ని సంవత్సరములకొకసారి ఆ యేటి పంటలో పదియవ భాగము తెచ్చి యింట ఉంచవలెను? (14)
18. హెబ్రీయుడేగాని, హెబ్రీయురాలేగాని ఎన్ని సంగులకు దాస్యము నుండి విడిపింపబడును? (15)
19. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశము నుండి ఏ సమయములో బయలుదేరి వచ్చిరి? (16)
20. ఇశ్రాయేలీయుల తమకు రాజుగా ఎవరిని నియమించుకొనవచ్చును? (17)
21. ఏ గోత్రము వారు స్వాస్థ్యము పొందలేదు? (18)
22. ఎంతమంది సాక్షుల మాట మీద ప్రతి విషయము స్థిరపరచబడును? (19)
23. ఒక పురమును అనేక దినములు ముట్టడి వేయునప్పుడు వేటిని పాడుచేయకూడదు? (20)
24. మొండివాడైన కుమారుడికి విధించవలసిన శిక్ష ఏమిటి? (21)
25. 22వ అధ్యాయములో పేర్కొనబడిన జంతువులు ఏవి?

**బైబిల్ క్విజ్-06 జవాబులు పంపినవారు :**

1. ఆనీమేరి, హైదరాబాద్, 2. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. స్వప్నిక-మార్కాపురం, 4. లలిత-రాజమండ్రి, 5. సబిత-కాకినాడ, 6. జ్యోతి-కనిగిరి, 7. రాధ-నెల్లూరు, 8. స్టీఫెన్-వరంగల్, 9. కుమారి-తెనాలి, 10. వెంకట్రావు-హైదరాబాద్, 11. ప్రియ-తాడిపత్రి, 12. రాజేష్-కడప. 13. ప్రియాంక-విజయవాడ.

## బైబిల్ క్విజ్ - 06 జవాబులు

1. పస్కా పండుగ(సంఖ్యా. 9:2) 2. హోబాబు(10:29) 3. దురాశ (11:34) 4. కూషు (12:1) 5. యెహోషువ (13:16) 6. 40 సంగులు (14:34) 7. 15:39-41 8. 250 (సంఖ్యా. 16:35) 9. అహరోను (17:12) 10. ఇరువది (18:16) 11. ఏడుమారులు (19:4) 12. ఎదోము (20:14) 13. ఓగు (21:33) 14. కిర్యోతు హచ్చోతు (22:39) 15. 23:19 16. 24:17 17. షిత్తీములో (25:1) 18. యోకెబెదు (26:59) 19. అబారీము (27:12) 20. ఏడు (28:17) 21. ఎనిమిదవ (29:35) 22. విధవరాలు, విడనాడబడినది (30:9) 23. ఎవీ, రెకెము, సూరు, హూరు, రేబ (31:8) 24. రూబేనీయులకు, గాదీయులకు (32:1) 25. హోరు (33:39)